ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

5

బుధవారం 23 జూలై 2025





పెనుమూడి సమీపంలో గుంతల మయంగా కరకట్ట

కరకట్టకు.. కోతలు

◆ గుంతలమయంగా రహదారి ◆ ప్రమాదభరితంగా మారినా పట్టించుకోరు ◆ ఇసుక టిప్పర్ల తాకిడికి పూర్తిగా కుంగిన కట్ట ◆ వరదల సమయంలో అధికారులు హడావుడి

నదీ తీర ప్రాంతాలపై కృష్ణమ్మ కన్నెర్ర చేయకుండా కట్టడి చేయాల్సిన కరకట్ట ప్రమాదకరంగా మారింది. కోతలతో కట్ట ఎక్కడికక్కడ బలహీనంగా మారింది. పటిష్ఠంగా ఉండాల్సిన కరకట్ట రహదారి మొత్తం పెద్దపెద్ద గోతులతో నిండిపోయి ఉంది. కోతలు, గుంతలతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకు వస్తోందోనని కరకట్ట సమీప గ్రామాల ప్రజలు ఆందోళనలో ఉన్నారు. ప్రధానంగా వర్షాలు, వరదల సమయాల్లో అయితే రాత్రిళ్లు కంటిమీద కునుకు వేయరంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. గతంలో కరకట్టకు పలు ప్రాంతాల్లో కోతతో ఆయా గ్రామాలను వరద ముంచెత్తినా అధికారులు హడావుడితో సరిపెట్టారే కానీ పటిష్ఠ చర్యలు తీసుకోవడంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



గుంతలు పడిన కరకట్ట

రేపల్లె, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజీకి ఎగువన వైకుంఠపురం నుంచి.. దిగువన కృష్ణమ్మ సముద్రంలో కలిసే వరకు ఉన్న కరకట్ట ప్రమాదకరంగా మారింది. వరదపోటును నివారించడంలో కరకట్ట పాత్ర ఎంతో కీలకమైనా ప్రభుత్వం దాని పటిష్ఠతపై దృష్టి సారించడంలేదు. ఎన్నో దశాబ్దాలుగా కృష్ణానది పరివాహక ప్రాంతాలుగా ఉన్న గ్రామాలను కావలి కాసే కరకట్ట పెను ప్రమాదాన్ని ఎదుర్కొంటోంది. ఇసుక టిప్పర్ల రాకపోకలతో ఎక్కడికక్కడ గోతులకు తోడు.. నదిలోని నీటిని వినియోగించుకునేందుకు గండ్లుకొట్టి వేసుకున్న పైపులతో కట్ట శిథిలావస్థకు చేరింది. శిథిలమైన కరకట్ట ప్రస్తుతం బలహీనంగా మారింది. కట్టపై యథేచ్ఛగా రాకపోకలు సాగిస్తున్న ఇసుక టిప్పర్ల నియంత్రణపై, అక్రమంగా పైపులైన్లు వేసుకుంటున్న వారిపై అధికారులు చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో కరకట్ట ప్రమాదకరంగా మారింది. అసలే అంతంతమాత్రంగా ఉన్న కరకట్ట ఇసుక తరలించే వాహనాలతో మరింత అధ్వానంగా మారింది. పెద్దపెద్ద గోతులతో నిండిపోయి ఎక్కడికక్కడ కుంగిపోయింది. పలుచోట్ల భారీగా కరకట్ట కోసుకుపోయింది. 2009 అక్టోబరు 5న తెల్లవారుజామున రేపల్లె మండలంలోని ఓలేరు పల్లెపాలెం వద్ద భారీ గండి పడి వరద నీరు చుట్టుపక్కల గ్రామాలను, పొలాలను ముంచెత్తింది. అప్పటి నుంచి ప్రతిఏటా వరదల సమయంలో ప్రత్యక్షమయ్యే అధికారులు, ప్రజాప్రతినిధులు కట్టను పటిష్ఠం చేస్తామంటూ ప్రకటనలు చేస్తున్నారే తప్ప పదేళ్లుగా పట్టించుకోలేదు. ఓ మోస్తరుగా నదిలో నీరు ప్రవహిస్తున్నా అది సమీప గ్రామాలను ముంచెత్తుతోంది. ప్రస్తుతం ఎగువ నుంచి భారీగా వరద వస్తోంది. పైగా బ్యారేజి గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకు వస్తుందోనని కట్ట వెంబడి గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కరకట్ట పటిష్ఠతను ఎప్పటికప్పుడు పరిశీలించాల్సిన కృష్ణారివర్ అథారిటీ అధికారులు కనీసం కట్టలపై దృష్టి సారించిన దాఖలాలు లేవు. వాహనాల రాకపోకలు, పైపులైన్లు వేసిన ప్రాంతాల్లో ఇప్పటికే కట్ట పూర్తిగా బలహీనపడింది. ఇలాంటి చోట్ల గండ్లు పడే ప్రమాదం పొంచి ఉంది. కిందటేడాది వచ్చినట్లు వరద వస్తే కట్ట మీద నుంచి రాజధానితో పాటు బ్యారేజీ దిగువన ఉన్న గ్రామాల్లోకి నీరు వచ్చే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. నది నుంచి ఇసుకను తరలించే భారీ టిప్పర్లు నిత్యం వందల సంఖ్యలో కరకట్టపై రాకపోకలు

(మిగతా 6లో)

సరిహద్దు నుంచి

పట్టణంలోకి..!


- దేవినూతలలో జోరుగా ఇసుక తవ్వకాలు
- రాత్రిళ్లు బాపట్ల పట్టణం, గ్రామాలకు తరలింపు



దేవినూతల గ్రామంలో పొలాల్లో ఇసుకను తవ్వి ట్రాక్టర్‌లలో నింపుతున్న ఎక్సకవేటర్

బాపట్లరూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): బాపట్ల - చీరాల సరిహద్దు గ్రామం దేవినూతల పంచాయతీలో జోరుగా ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. చీరాల మండల పరిధిలోని ఈ గ్రామ పంట పొలాల్లో పొక్లెయినర్ల ద్వారా ఇసుక తవ్వకాలు చేపట్టి.. ట్రాక్టర్ల ద్వారా బాపట్ల పట్టణం, మండలంలోని పలు గ్రామాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. కట్టుబడి, పూడిక ఇసుకను రాత్రిళ్లు, తెల్లవారు జామున మరుప్రోలువారిపాలెం, మద్దిబోయినవారిపాలెం, ముత్తాయిపాలెం, పిన్నిబోయినవారిపాలెం, బసివిరెడ్డిపాలెం, హనుమాన్‌నగర్, పోతురాజు కొత్తపాలెం, ఆసోదివారిపాలెం, నాగేంద్రపురం గ్రామాలకు చేర్చేస్తున్నారు. బాపట్లకు, చీరాలకు చివరి గ్రామం కావడంతో ఇసుక తవ్వకాలు జరిపినా ఎవరూ ఏమి చేయలేరు అనే ధీమా అక్రమార్కుల్లో మెండుగా కనిపిస్తోంది. బాపట్ల రూరల్ పోలీసులు, మైనింగ్ అధికారులు వీటిపై చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.





8

ఉప సంఘంలో.. మంత్రులు

అనగాని, నాదెండ్ల

జిల్లాల సరిహద్దులు, పేర్ల మార్పులకు క్యాబినెట్ సబ్ కమిటీ

త్వరలో జిల్లాల్లో పర్యటించే అవకాశం

కందుల డబ్బులు ఎప్పుడు

పడతాయబ్బా..!

ఖరీఫ్ సాగు ఖర్చులకు రైతుల ఎదురుచూపులు

అమరావతి రైలు మార్గానికి..భూములిస్తాం!

- నష్టపరిహారం ఎంత ఇస్తారో చెప్పాలి
- కొప్పురావూరులోని కొంతమంది రైతులు జేసీకి నివేదన

సెప్టెంబరు 29 నుంచి శబరి ప్రయాణ సమయం మార్పు

దంచికొట్టిన వాన

అత్యధికంగా పర్చూరులో 59.2 మి.మీ

వెద పొలాలు ముంపు.. అన్నదాతల్లో ఆందోళన

(బాపట్ల, భట్టిప్రోలు, కొల్లూరు, చెరుకుపల్లి, ఆంధ్రజ్యోతి)

మూడు రోజులుగా జిల్లావ్యాప్తంగా వర్షాలు దంచి కొడుతున్నాయి. మంగళవారం ఉదయం పర్చూరు, అద్దంకిలో కుండపోత వర్షం కురిసింది. సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం ఉదయం వరకు కురిసిన కుండపోత వర్షానికి జిల్లా వ్యాప్త సగటు వర్షం 29.25. మి.మీటర్లుగా నమోదైంది. అత్యధికంగా పర్చూరులో 59.2 మి.మీటర్ల



బాపట్ల మండలం చెరువుజమ్ములపాలెంలో వెదపెట్టిన పొలాలలో నిలిచిన వర్షపునీరు

వర్షపాతం నమోదైంది. కారంచేడు 51.2, బాపట్ల 37.4 మి.మీ. వర్షం కురవగా అత్యల్పంగా భట్టిప్రోలులో 11.4 మి.మీ. వర్షం కురిసింది. పర్చూరులో కురిసిన కుండపోత వర్షం ధాటికి అడుసుమల్లి సమీపం లోని సాకి వాగుకు గండ్లు పడి సమీప పొలాలను ముంచెత్తింది. బాపట్ల సబ్ డివిజన్ పరిధిలోని బాపట్ల, కర్లపాలెం, అమర్తలూరు, పిట్టలవానిపాలెం, కొల్లూరు, భట్టిప్రోలు తదితర మండలాల్లో వేలాది ఎకరాలు వెద సాగులో ఉన్నాయి. వెద పద్ధతిలో వరి సాగు చేసిన రైతులకు ఈ వర్షాలు కొంతమేర ఊరట కలిగించాయి. ముందుగా వెదపెట్టిన పొలాల్లో మొలక పైకొచ్చిన పైర్లకు వర్షం వల్ల ఇబ్బంది లేదు. అయితే ఈ వర్షాలు మరో రెండు రోజులు కొనసాగితే నష్టం తప్పదని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే జిల్లాలోని పలు ప్రాంతాల్లోని వెద పొలాలు వర్షపు నీటితో ముంపునకు గురై ఉన్నాయి. ఆలస్యంగా పెట్టిన వెదవిత్తనాలు మురిగిపోయే ప్రమాదం ఉంది. కాల్వల గుండా నీరు వెళ్లే పరిస్థితులు సక్రమంగా లేకపోవడంతో పొలాల్లోని నీటిపై రైతులు ఆందోళన చెందుతున్నారు. అయితే మంగళవారం వరుణుడు శాంతించడంతో ఊపిరి పీల్చుకున్నారు. మరో రెండు రోజులు భారీ వర్షాలపై వాతావరణ శాఖ హెచ్చరికలు రైతులను కలవరపాటుకు గురిచేస్తున్నాయి. పర్చూరు, అద్దంకి నియోజకవర్గాల పరిధిలోని బర్లీ పొగాకు రైతులను ఈ వర్షాలు కొంత కలవరపాటుకు గురిచేశాయి. భారీ వర్షాల ధాటికి బేళ్ల కిందకి నీళ్లు వెళ్లాయని తేమ శాతంలో ఇబ్బందులు ఎదురవుతాయేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ వర్షాలు అద్దంకి నియోజకవర్గ పరిధిలో మొక్కజొన్న, నువ్వులు లాంటి మెట్టపంటలు సాగు చేసే రైతులకు మేలు చేశాయి. కొన్ని రోజులుగా వర్షం జాడే లేక పోవడంతో వాటి ఎదుగుదల ఆగిపోయింది. ఈ వర్షాలు వాటికి ఊపిరి పోశాయి.



ఉధృతంగా ప్రవహిస్తున్న ఆర్ఎం డ్రెయిన్

ఉధృతంగా ఆర్ఎం డ్రెయిన్

చెరుకుపల్లి మండలంలోని గూడవల్లి ఆర్ఎం డ్రెయిన్ ఉధృతంగా ప్రవహిస్తోంది. గూడవల్లి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం వద్ద తూటికాడతో నీరు దిగువకు వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో ఇక్కడ కట్టలు తెగిపోయే పరిస్థితి నెలకొనడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ప్రవర్తనలో..

మార్పు తెచ్చుకోవాలి

- సబ్‌జైలు సందర్శనలో ఖైదీలతో జడ్జి జియావుద్దీన్



సబ్‌జైలును సందర్శిస్తున్న గుంటూరు జిల్లా సీనియర్ సివిల్ జడ్జి సయ్యద్ జియావుద్దీన్

రేపల్లె, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఖైదీలు క్షణికావేశానికి లోను కావొద్దని, ప్రవర్తనలో మార్పు తెచ్చుకోవాలని గుంటూరు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సయ్యద్ జియావుద్దీన్ సూచించారు. మంగళవారం తాలూకా ప్రాంగణంలోని సబ్‌జైలును ఆయన సందర్శించి వసతులను పరిశీలించారు. ఖైదీల గదులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఖైదీలకు న్యాయపరమైన సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలోప్యానల్ అడ్వకేట్ గుమ్మడి కుమార్‌బాబు, జైలు అధికారులు పాల్గొన్నారు.

ఆదర్శవంతమైన జీవితాలే లక్ష్యం

పీ-4 గ్రామసభలో ఆర్డీవో రామలక్ష్మి

నగరం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్క కుటుంబాన్ని ఆదర్శ వంతంగా తీర్చదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఆర్డీవో రామలక్ష్మి తెలిపారు. నగరం పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం జరిగిన పీ- 4 గ్రామసభలో ఆమె ప్రసంగించారు. పంచాయతీ పరిధిలోని 43 బంగారు కుటుంబాల బాధ్యతను ఆరు మార్గదర్శులతో జత చేశామన్నారు. బంగారు కుటుంబాలు స్థితిగతులు గురించి తెలుసుకుని వా రికి అందుకు అనుగుణంగా మార్గదర్శకులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బీశ్రీనివాసరావు, తహసీల్దార్ నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.



గ్రామసభలో మాట్లాడుతున్న ఆర్డీవో రామలక్ష్మి

వెస్ట్‌బైపాస్ ఎంట్రన్స్ వద్ద జరుగుతున్న ఆర్చ్ నిర్మాణ పనులు



అనుసంధానం మొదలు

తుది దశకు వెస్ట్ బైపాస్ ప్యాకేజీ-4

కాజ జంక్షన్ వద్ద అనుసంధాన పనులు

రాకపోకలు ఎన్‌హెచ్- 16 సర్వీసు రోడ్డులోకి మళ్లింపు

సెప్టెంబరు చివరికి అందుబాటులోకి..

గుంటూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): విజయవాడ, గుంటూరు నగరాల ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడం, రాజధాని అమరావతిని అన్ని జిల్లాలకు అనుసంధానించడంలో అత్యంత కీలకమైన వెస్ట్ బైపాస్ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ పక్కనే ఉన్న గొల్లపూడి నుంచి గుంటూరు జిల్లా కాజ టోల్‌గేటు వరకు సాగుతున్న ప్యాకేజీ 4 నిర్మాణ పనులు దాదాపుగా పూర్తయ్యా యి. ప్రస్తుతం కాజ టోల్ గేట్‌కు సమీపంలో ఈ రోడ్డును ఎన్‌హెచ్-16లో అనుసంధానించే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

● కీలకమైన బ్రిడ్జి పూర్తి

విజయవాడ వెస్ట్ బైపాస్‌ను ప్యాకేజీ- 4 కింద 18.2 కిలోమీటర్ల మేర ఆరు వరుసల్లో నిర్మిస్తున్నారు. ఇందులో కృష్ణానదిపై 3.2 కిలోమీటర్ల మేర నిర్మించే బ్రిడ్జి అత్యంత కీలకమైంది. ఈ బ్రిడ్జి నిర్మాణం దాదాపు మూడు నెలల క్రితమే పూర్తయింది. రాజధాని అమరావతి పునర్నిర్మాణ కార్యక్రమంలో భాగంగా మే 2న ఈ బ్రిడ్జి అందుబాటులోకి కూడా వచ్చింది. ఈ సమయంలో ఎన్టీఆర్, కృష్ణా, ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి, ఉత్తరాంధ్ర జిల్లాల కూటమి ముఖ్య నేతలకు ఈ బ్రిడ్జి మీద నుంచే రూట్ మ్యాప్ ఇచ్చారు. జూన్ నుంచి బ్రిడ్జి అందుబాటులోకి వస్తుందని భావించినప్పటికీ మిగిలిన ప్రాంతాల్లో పనులు పెండింగ్ ఉండడంతో బ్రిడ్జి ఇప్పటి వరకు

(మిగతా 6లో)

మంగళగిరి రైల్వే ట్రాక్‌పై పూర్తయిన ఆర్వోబీ



గాడితప్పిన సంక్షేమం

సాంఘిక సంక్షేమ వసతి గృహాల పర్యవేక్షణలో నిర్లక్ష్యం

బాపట్ల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పర్యవేక్షణ లోపం, సంక్షేమంపై నిర్లక్ష్యం వెరసి పేద విద్యార్థులకు శాపంగా మారింది. పాఠశాల, కళాశాల వసతి గృహాల్లో ఇది స్పష్టంగా కనిపిస్తోంది. గత ఐదేళ్లుగా సాంఘిక సంక్షేమ శాఖలో ఏకపక్ష నిర్ణయాలు ఇందుకు కారణంగా కనిపిస్తున్నాయి. నూతన డీడీ చెన్నయ్య ఆధ్వర్యంలో అయినా ఆ శాఖ పనితీరు మెరుగుపడుతుందా అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇటీవల నూత డీడీ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి మార్గదర్శకాలు జారీ చేశారు.

ఐదేళ్లుగా సమీక్షలు నిల్

ఉమ్మడి గుంటూరు జిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కళాశాల, పాఠశాల విద్యార్థుల కోసం ప్రత్యేకంగా వసతి గృహాలున్నాయి. వీటిల్లో దాదాపు పదివేల మందికి పైగా విద్యార్థులు వసతి పొందుతూ విద్యాభ్యాసం చేస్తున్నారు. వసతి గృహాలను పరిశీలిస్తే.. ఒకరిద్దరూ మినహా మిగిలిన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు పూర్తిస్థాయిలో పర్యవేక్షిస్తున్న దాఖలాలు కనిపించడం లేదు. ఫలితంగా అనేక సమస్యలు వసతి గృహాల్లో తిష్ట వేశాయి. గుంటూరు నగరంలోనే పరిపాలన గాడి తప్పిందంటే మారుమూల ప్రాంతాల్లోని వసతి గృహాల పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

సంక్షేమ వసతి గృహాల్లో దారుణాలు

గుంటూరులోని సంక్షేమ శాఖ వసతి గృహంలో వాచ్‌మెన్, ఆయాల ప్రోద్బలంతో కొంతమంది ఆకతాయిలు విద్యార్థుల్ని లైంగికంగా (మిగతా 6లో)



సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహం

- కళాశాల బాలికల భద్రతపై నీలినీడలు
- అనేక ఘటనలు వెలుగు చూస్తున్నా.. పట్టించుకోని వైనం
- మౌలిక వసతులు, భోజనంపై విద్యార్థినుల అసంతృప్తి

అనుసంధానం మొదలు

(5వ పేజీ తరువాయి)

అందుబాటులోకి రాలేదు.

మందడం, కృష్ణాయపాలెం వద్ద జాప్యం

మందడం టోల్‌గేట్ నిర్మాణంతో పాటు ఇక్కడే నిర్మిస్తున్న ఫ్లైఓవర్ పనులు ఇంకా కొంతమేర పెండింగులో ఉన్నాయి. దీంతోపాటు కృష్ణయ్యపాలెం, కురగల్లు సమీపంలో ఈ-11 రోడ్డు సమీపంలో కొండవీటివాగు రిజర్వాయర్ వద్ద నిర్మిస్తున్న బ్రిడ్జి పనులు కూడా జాప్యానికి మరో కారణం. ఈ పనులు కూడా ప్రస్తుతం చివరి దశలో ఉన్నాయి. కాగా ఈ-10 రోడ్డు వద్ద అప్రోచ్ రోడ్డు పనులు జరుగుతున్నాయి. దీంతో పాటు గుంటూరు- విజయవాడ రైల్వే లైనుపై మంగళగిరి, చినకాకాని సమీపంలో నిర్మించే ఆర్వోబీ కూడా పూర్తయింది. సేఫ్టీ వాల్ నిర్మాణ పనులు తుది దశకు చేరాయి.

కాజ జంక్షన్ వద్ద అనుసంధాన పనులు

కాజ- చినకాకాని సరిహద్దుల్లో వెస్ట్ బైపాస్ అనుసంధానించడం కోసం ఎన్‌హెచ్-16 మీద రాకపోకలను సర్వీసు రోడ్డులోకి మళ్లించారు. కాజ జంక్షన్ వద్ద వెస్ట్ బైపాస్ ఎంట్రన్స్‌లో పెద్ద ఆర్చి నిర్మాణాన్ని ఏర్పాటు చేసి సైన్ బోర్డులను ఏర్పాటు చేస్తున్నారు. చిలకలూరిపేట వద్ద నిర్మించిన బైపాస్‌ను ఎన్‌హెచ్- 16లో అనుసంధానించిన విధంగానే కాజ వద్ద కూడా రెండు రోడ్ల అనుసం ధానం ఉంటుందని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు చెబుతున్నారు. కాగా సెప్టెంబరు చివరి నాటికి వెస్ట్ బైపాస్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుందని వారు స్పష్టం చేశారు.

కరకట్టకు.. కోతలు

(5వ పేజీ తరువాయి)



ఓలేరుపల్లెపాలెంవద్ద కుంగిన కరకట్ట

సాగిస్తున్నాయి. దీంతో రాజధాని గ్రామాలైన లింగాయపాలెం, ఉద్దండ రాయునిపాలెంలో కరకట్ట పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా మారింది. గత వైసీపీ హయాంలో అప్పటి ఎంపీ నందిగం సురేశ్ నేతృత్వంలో టిప్పర్ల రాకపోకలతో కరకట్ట పూర్తిగా ధ్వంసమైపోయింది. బ్యారేజి దిగువన పిరాట్లంక, చెన్నుపల్లివారిపాలెం, కనగాలవారిపాలెం సమీపంలో పైప్‌లైన్లతో ప్రమాద భరితంగా మారింది. దీంతో మైనేనివారిపాలెం, పిరాట్లంక, చెన్నుపల్లివారిపాలెం, గంగడిపాలెం, లక్ష్మీపురం, అడవిపాలెం గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. కట్టను పటిష్టం చేయాలని ఆయా గ్రామాల ప్రజలు అధికారులను, ప్రజాప్రతినిధులను కోరినా ఇప్పటి వరకు దాని గురించి పట్టించుకోలేదంటున్నారు. కరకట్టపై పెట్రోలింగ్ చెయ్యాల్సిన అధికారులు స్థానికంగా ఉండకుండా గుంటూరులో నివాసం ఉంటున్నారు. దీంతో కట్టపై పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. గత ఏడాది వరదల సమయంలో కృష్ణారివర్ ఏఈ ప్రత్యక్షమై హడావుడి చేశారు. ఆ తర్వాత ఈ పదినెలల్లో ఒక్కసారి కూడా కట్టను పరిశీలించిన దాఖలాలు లేవు.

వేటకు వెళ్లిన మత్స్యకారుడి మృతి

నిజాంపట్నం(రేపల్లె),జూలై22 (ఆంధ్రజ్యోతి): చేపల వేట చేస్తూ ప్రమాదవశాత్తు సముద్రంలో పడి కొత్తపాలెం పంచాయతీ శారదా నగర్‌కు చెందిన బాల కోటయ్య మృతి చెందాడని అడవులదీవి ఎస్‌ఐ బాబూరావు తెలిపారు. మంగళవారం కొత్తపాలెం సముద్ర సమీపంలో పడవలో వేటకు వెళ్లగా అలల తాకిడికి సముద్రంలో పడి బాల కోటయ్య(23)మృతి చెందాడని చెప్పారు. ఇతర మత్స్యకారులు గమనించి మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. ఈ విషయాన్ని గ్రామస్తులకు తెలపడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఘటన స్థలానికి పోలీసులు చేరుకుని విచారించారు. కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.



బాలకోటయ్య మృతదేహం

భార్య ఆత్మహత్య కేసులో భర్తకు జైలు..

చెరుకుపల్లి, జూలై22 (ఆంధ్రజ్యోతి): చెరుకుపల్లి మండలం కనగాలలో 2018లో జరిగిన లక్ష్మీరేఖ ఆత్మహత్య కేసులో ముద్దాయి, ఆమె భర్త అద్దంకి గంగాధరరావుకి రేపల్లె అసిస్టెంట్ సెషన్స్ కోర్టు ఆరు సంవత్సరాల జైలు శిక్ష, రూ.4 వేల జరిమానా మంగళవారం విధించింది. కృష్ణాజిల్లా చల్లపల్లి మండలం మంగళాపురానికి చెందిన జంపాల వెంకటేశ్వరరావు మూడవ కుమార్తె లక్ష్మీరేఖ, గంగాధరరావు భార్యభర్తలు వీరికి ఒక కుమార్తె ఉంది. అత్తింటివారు హింసించడంతో లక్ష్మీరేఖ ఉరివేసుకుందని కేసు నమోదైంది. ఈ కేసును అప్పటి ఎస్‌ఐ జి.రాజేశ్వరరావు దర్యాప్తు చేశారు.

అంధ బాలిక హత్య కేసులో రౌడీషీటర్‌కి జీవిత ఖైదు

గుంటూరు (లీగల్), జూలై 22(ఆంధ్రజ్యోతి): అంధ బాలికను హత్య చేసిన కేసులో నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ పోక్సో న్యాయస్థానం జడ్జి షమ్మి పర్విన్ సుల్తాన్ బేగం మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం తాడేపల్లి పట్టణంలోని ఎన్‌టీఆర్ కట్ట వద్ద 2023 ఫిబ్రవరి 12న ఒంటరిగా ఉన్న 17 ఏళ్ల అంధ బాలికపై నిందితుడు నాగపోగు దయానందరాజు అలియాస్ కుక్కల రాజు తన కోర్కె తీర్చలేదన్న కక్షతో కత్తితో విచక్షణారహితంగా నరికివేశాడు. తీవ్రంగా గాయపడిన బాలికను విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా 13న చికిత్స పొందుతూ బాలిక మృతి చెందింది. వ్యసనాలకు బానిసైన కుక్కల రాజు భార్య, తల్లిదండ్రులకు దూరంగా ఉంటూ కొంతకాలంగా ఈ ప్రాంతంలో నివశిస్తూ ఈ బాలికపై కన్నేశాడు. తల్లి పనులకు వెళ్లిన సమయంలో బాలిక తన చిన్నమ్మ ఇంటి వద్ద కూర్చొని ఉంది. ఈ సమయంలో నిందితుడు తన కోర్కె తీర్చమని కోరగా బాలిక ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకుంది. కొద్దేసపటికి బాలిక తల్లి రాగా విషయం తెలుసుకుంది. ఈ విషయంపై బాలిక తల్లి కుక్కల రాజును నిలదీసింది. అనంతరం బాలికను తన ఇంట్లో ఉంచి కిరణా దుకాణం వద్దకు ఆమె వెళ్లింది. దీంతో ఒంటరిగా ఉన్న బాలికపై రాజు ఆగ్రహంతో కత్తితో శరీరం మొత్తం నరికి తీవ్రంగా గాయపర్చాడు. వెంటనే తల్లివచ్చి ఘొల్లుమంది. 108 వాహనంలో బాలికను విజయవాడ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బాలిక మృతి చెందింది. నిందితుడి కుక్కల రాజును తాడేపల్లి పోలీసులు అరెస్టుచేసి కోర్టులో హాజరు పర్చారు. కోర్టులో అప్పటి దిశ మహిళా పోలీస్‌స్టేషన్ సౌత్ డీఎస్పీ జెస్సీ ప్రశాంతి చార్జిషీటు దాఖలు చేశారు. నిందితుడు గత రెండున్నర ఏళ్లుగా జైలులో ఉన్నాడు. విచారణలో ప్రాసిక్యూషన్ నేరం రుజువు చేయడంతో జీవిత ఖైదు, రెండు రూ.వేల జరిమానా విధిస్తూ న్యాయమూరి తీర్పు నిచ్చారు. ఈ కేసులో మైనర్ బాలిక హత్యకు సంబంధించి పోక్సో చట్టం కింద 5 ఏళ్ల జైలు శిక్షతో పాటు జీవిత ఖైదు ఏకకాలంలో అమలు చేయాలని న్యాయమూర్తి చెప్పారు. ఈ కేసులో ప్రత్యక్ష సాక్షి గడ్డం మాధురి కీలక సాక్ష్యం చెప్పారు. అంధబాలికను నరికిన సమయంలో రక్తం చింది నిందితుడు కుక్కల రాజు చొక్కాపై పడటంతో.. పోలీసులు బాలిక రక్తం, నిందితుడు చొక్కాపై పడిన రక్తం నమూనాలను డీఎన్‌ఏ పరీక్షలకు పంపగా ఒక్కటేనని తేలింది. ఈ నివేదిక కేసులో కీలక సాక్ష్యంగా నిలిచింది. ప్రాసిక్యూషన్ తరుపున జిల్లా డిప్యూటీ డైరక్టర్ ఎండి బర్కత్ ఆలీఖాన్ నిర్వహించారు.

కూలిన జీవితం..

గుంటూరు కార్పొరేషన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): గుంటూరులో కల్వర్టు నిర్మాణంలో ఉన్న పనుల్లో స్లాబ్ కూలి కార్మికుడు మృతి చెందిన ఘటన మంగళవారం జరిగింది. నగరంలోని దేవాపురం పీకల వాగుపై కల్వర్టు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. నగరపాలక సంస్థ చెందిన కాంట్రాక్టర్ కావూరి కృష్ణ చైతన్య ఈ పనులను రూ.8 లక్షలకు టెండర్ దక్కించుకొని పనులు ప్రారంభించాడు. కల్వర్టు స్లాబు పనులు చివరి దశలో ఉన్నాయి. కూలి పనులకు వచ్చిన గోరంట్లకు చెందిన తాపీ కార్మికుడు తోట అప్పారావు(50) కిందుకు దిగి.. స్లాబ్ కింద పెట్టిన కర్రలను పరిశీలిస్తున్నాడు. ఈ క్రమంలో ముందుకు పడబోయిన ఆయన స్లాబ్‌కు పెట్టిన కర్రను లాగడంతో.. నిర్మాణ దశలో ఉన్న స్లాబ్ మొత్తం కూలి అతనిపై పడింది. అప్పారావు స్లాబ్ కింద పడిపోయి అక్కడే మృతి చెందాడు. నగర మేయర్ రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు, ఇంజనీరింగ్ అధికారులు ఘటన స్థలానికి చేరుకొని పొక్లెయినర్‌తో ద్వారా స్లాబ్‌ను తొలగించారు. మృతదేహాన్ని బయటకు తీసి.. పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు.



కూలిన కల్వర్టు స్లాబ్, తోట అప్పారావు(ఇన్‌సెట్)

నాటి ఇసుక అక్రమాలపై నేడు చర్యలు

● శాటిలైట్ ఛాయా చిత్రాలతో ఇసుక అక్రమాలు గుర్తింపు

నరసరావు పేట, జులై 22 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం హయాంలో జరిగిన ఇసుక అక్రమాలపై జిల్లా యంత్రాంగం దృష్టి సారించింది. 2021-2024 కాలానికి జిల్లాలోని ఇసుక రీచ్‌లలో అక్రమ తవ్వకాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకొనేందుకు ఇసుక కమిటీ సిద్ధమైంది. శాటిలైట్ ఛాయా చిత్రాల ఆధారంగా 126 హెక్టార్లలో ఇసుక అక్రమ తవ్వకాలు జరిగినట్లు నిర్ధారించారు. ఈ నేపథ్యంలో సంబంధిత సంస్థలను, బాధ్యులను గుర్తించారు. అక్రమార్కులపై కేసులు నమోదు చేసేందుకు ఇసుక కమిటీ చర్యలు చేపట్టింది. జేసీ సూరజ్ మంగళవారం ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లాలో పెద్ద ఎత్తున జరిగిన ఇసుక తవ్వకాలపై యంత్రాంగం చర్యలు ఉపక్రమించింది. మాచర్ల నియోజకవర్గంలో నూతన ఇసుక స్టాక్ పాయింటును వారం రోజుల్లోగా ఏర్పాటు చేయాలని కమిటీ నిర్ణయించింది. జిల్లాలో అక్టోబరు 15 వరకూ ఇసుక తవ్వకాలపై నిషేధం ఉంటుందని, అప్పటి వరకూ తవ్వకాలను నిరోధించేందుకు జిల్లా, మండల స్థాయి టాస్క్ ఫోర్సులు పని చేస్తాయని జేసీ తెలిపారు. జేసీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అదనపు ఎస్పీ జేవీ సంతోష్, జిల్లా మైన్స్, జియాలజీ అధికారి నాగిని, ఆర్డీవోలు రమణాకాంత్‌రెడ్డి, మురళీ కృష్ణ, భూగర్భ జల శాఖ ఏడీ రామబాలాజీ రెడ్డి, పిడుగురాళ్ల మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు పాల్గొన్నారు.

చిన్నతనం నుంచి క్రీడల్లో ప్రోత్సహించాలి

● శాప్ చైర్మన్ రవి నాయుడు

పెదకాకాని, జూలై 22(ఆంధ్రజ్యోతి): చిన్నతనం నుంచి విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలని శాప్ చైర్మన్ రవి నాయుడు పేర్కొన్నారు. మంగళవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో చిన్నారుల క్రీడలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తానా మహా సభల్లో రాష్ట్రంలో క్రీడల అభివృద్ధి కోసం, తెలుగు ప్రజలు సహాయ సహకారాలు అందించాలని అభ్యర్థించినట్లు గుర్తుచేశారు. రాష్ట్రంలో క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నట్లు వెల్లడించారు.



క్రీడలను ప్రారంభిస్తున్న శాప్ చైర్మన్ రవి నాయుడు

ఎస్ఐఆర్ నిర్వహించి ఓటర్ల జాబితా రూపకల్పన

● జిల్లా రెవెన్యూ అధికారి ఖాజావలి

గుంటూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): భారత ఎన్నికల సంఘం గతంలో నిర్వహించిన విధంగా స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్(ఎస్ఐఆర్) నిర్వహించి ఓటర్ల జాబితా రూపొందించాలన్న ఆలోచనలో ఉందని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్ఎస్‌కే ఖాజావలి పేర్కొన్నారు. దీనిపై త్వరలోనే ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకొని మార్గదర్శకాలు జారీ చేసిన వెంటనే రాజకీయ పార్టీల ప్రతినిధులకు తాము తెలియజేస్తామన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని శంకరన్ మినీ సమావేశ మందిరంలో డీఆర్‌వో అధ్యక్షతన గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డీఆర్‌వో ఖాజావలి మాట్లాడుతూ పోలింగ్ బూత్‌లలో 1,200 మంది ఓటర్లు ఉండేలా, అంతకంటే అదనంగా ఉన్న ఓటర్లను సమీపంలోని పోలింగ్ బూత్‌లలో సర్దుబాటు చేసే ప్రక్రియను ప్రాథమికంగా పూర్తి చేయడం జరిగిందన్నారు. దీనిపై నియోజకవర్గాల వారీగా ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీలతో చర్చించి అమోదం కోసం ఎన్నికల సంఘానికి పంపడం జరుగుతుందన్నారు. జిల్లాలోని బీఎల్వోలకు నియోజకవర్గాల వారీగా ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం శిక్షణను పూర్తి చేయడం జరుగుతుందన్నారు. బీఎల్వోల మార్పులు, చేర్పులకు ఇక నుంచి రాష్ట్ర ఎన్నికల సంఘం నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉన్నందున జూలై 31 నాటికి బీఎల్వోల వివరాలు అమోదం కోసం ఎన్నికల సంఘానికి పంపించటం జరుగుతుందన్నారు. అదే విధంగా రాజకీయ పార్టీలు నియమించే బూత్ లెవల్ ఏజెంట్ నియమకానికి ఎన్నికల సంఘం నుంచి అమోదం తీసుకోవాల్సి ఉన్నందున రాజకీయ పార్టీల ప్రతినిధులు పోలింగ్ బూత్‌లు వారీగా బీఎల్ఏల వివరాలు అందించాలన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ టోసేవా కుమార్(ఆప్), చిరతనగండ్ల వాసు(బీఎస్పీ), వైవీ సుబ్బారావు(బీజేపీ), బి.సునీల్ కుమార్(కాంగ్రెస్), కె. శివరామయ్య(టీడీపీ), సీహెచ్ త్రినాథ్(జనసేన), ఈఆర్వోలు లక్ష్మీకుమారి, గంగరాజు, ఆర్డీవో శ్రీనివాసరావు, నగరపాలక సంస్థ అదనపు కమిషనరు చల్లా ఓబులేసు, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ మల్లేశ్వరి పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల నేతల సమావేశంలో ప్రసంగిస్తున్న డీఆర్‌వో ఖాజావలి

గాడితప్పిన సంక్షేమం

(5వ పేజీ తరువాయి)

వేధించిన ఘటనలున్నాయి.

● నగరంలోని కలెక్టర్ బంగ్లా రోడ్డులోని ఓ కళాశాల హాస్టల్‌లో ఓ విద్యార్థిని గర్భం దాల్చి, బిడ్డకు జన్మనిచ్చినా.. గుర్తించలేని దుస్థితిలో పర్యవేక్షణ ఉంది.

● జూట్ మిల్ సమీపంలోని మరో కళాశాల వసతి గృహంలోని ఒక విద్యార్థినిని వైసీపీ పాలనలో ఓ నాయకుడి అనుచరులు మాయమాటలు చెప్పి కిడ్నాప్ చేశారు. నగరంలోని రాజీవ్ స్వగృహ నివాసాల్లో ఉంచి రెండు రోజులు వేధించారు.

● నగరం నడిబొడ్డున ఒక వసతి గృహంలో వంట సరిగా లేక.. విద్యార్థులు సమీపంలోని అన్న క్యాంటీన్‌కి వెళ్లి భోజనం చేశారు. ఈ విషయం అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ గతం డీడీకి నివేదించినా.. పట్టించుకో లేదు.

●సాంఘిక సంక్షేమ శాఖలో ఔట్ సోర్సింగ్ సిబ్బంది నుంచి కొంతమంది అధికారులు నెలనెలా మామూలు వసూళ్లు చేస్తున్నారని ఫిర్యాదులు ఉన్నాయి. సిబ్బంది పనిచేయ కపోయినా.. వారికి జీతాలు ఇస్తూ అందిన కాడికి దండుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి.

● మరోవైపు హెచ్‌డబ్ల్యూఓలు పెట్టే బిల్లుల్లో కూడా కమిషన్లు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి కొంతమంది అధికారులు ప్రొటోకాల్ పేరుతో భారీ మొత్తంలో వసూళ్లు చేసిన ఘటనలు ఉన్నాయి.

● కొంతమంది హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లపై విజిలెన్స్ విచారణ ఉన్న పట్టించుకోవడం లేదని, పూర్తిస్థాయిలో దర్యాప్తు జరపడం లేదని విమర్శలున్నాయి.

● తాజాగా నగరంలోని ఓ కళాశాల హాస్టల్ నుంచి ఓ విద్యార్థిని అదృశ్యమైనట్లు ఫిర్యాదులు ఉన్నాయి. ఈ విషయం గోప్యంగా ఉంచి సదరు అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఇలా సాంఘిక సంక్షేమ శాఖ గత అధికారుల హయాంలో గాడి తప్పింది. నూతనంగా వచ్చిన అధికారి అయిన శాఖను గాడిలో పెడతారా? లేదా అని విద్యార్థులు వారి తల్లిదండ్రులు సిబ్బంది ఎదురుచూస్తున్నారు.

రైలు కింద పడి యువతి ఆత్మహత్య

సత్తెనపల్లి రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : రైలు కింద పడి యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని వెన్నాదేవి వద్ద గల రైల్వే గేటు సమీపంలో మంగళవారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సుమారు 19 ఏళ్ల వయస్సు గల యువతి సాయంత్రం 7 గంటల సమయంలో రైల్వే ట్రాక్‌పై నడుచుకుంటూ వెళ్లింది. తాము ఎంత వారించినా యువతి పట్టాల పైనే నడుచుకుంటూ వెళ్లిందని స్థానికులు తెలిపారు. ఆ సమయంలో విజయవాడ నుంచి సికిందరాబాద్ వెళ్తున్న రాజధాని ఎక్స్‌ప్రెస్ ఢీకొట్టడంతో యువతి అక్కడికక్కడే మృతి చెందింది. ఐతే యువతి అక్క బావలు కొద్ది నెలల నుంచి వెన్నాదేవిలో నివాసం ఉంటున్నట్టు, అక్క కోసం వచ్చిన యువతి ఇలా రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్టు సమాచారం. యువతిది బెల్లంకొండ మండలం గంగిరెడ్డిపాలెం గ్రామంగా తెలిసింది. యువతి మృత దేహాన్ని కుటుంబ సభ్యులు తీసుకెళ్లారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య

ఈపూరు, జూలై22(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతూ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని బొమ్మరాజుపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన పందిరి నాగేశ్వరరావు(52) గత కొంతకాలంగా కడుపులో నొప్పితో బాధపడుతున్నాడు. వైద్యం చేయించుకోవడానికి ఆర్థిక ఇబ్బందులుండడంతో.. బాధ తట్టుకోలేక సోమవారం తెల్లవారుజామున ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు బంధువులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ సాంబయ్య తెలిపారు.

ప్రమాదవశాత్తూ రైలు ఢీకొని..

తెనాలి, మారీసుపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పట్టాలు దాటుతుంగా రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక చెంచుపేటకు చెందిన డి జాన్‌బాబు (55) గుంటూరు ఆర్ అండ్ బీ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ టెక్నికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గత కొంతకాలంగా పెరాల్సిస్ రావడంతో ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఈ క్రమంలో మంగళవారం తెనాలి రైల్వే స్టేషన్ 4వ నంబరు ప్లాట్‌ఫాం వద్ద పట్టాలు దాటుతుండగా రైల్ రావడం గమనించక ట్రైన్ ఢీకొని మృతి చెందాడు. ట్రైన్ లోకో పైలెట్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడు జాన్‌బాబుకు భార్య, కుమార్తె ఉన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు..

తాడేపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో ఓ యువకుడు గడ్డి మందు తాగి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. తాడేపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దుగ్గిరాల మండలం పేరుకలపూడి గ్రామానికి చెందిన తోట వెంకటేష్ (22) అప్పుల బాధతో ఈ నెల 18న చిర్రావూరు కరకట్ట వెంబడి పొలాల్లో గడ్డి మందు తాగాడు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినటట్లు పోలీసులు తెలిపారు. కాగా, తల్లిదండ్రులు లేకపోవడంతో మేనమామ శివగంగరాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

భార్యతో గొడవ..ఉరివేసుకున్న భర్త

భార్యా భర్తల తగాదాల నేపథ్యంలో ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తాడేపల్లి ఎస్ఐ ఖాజావలి తెలిపిన వివరాల ప్రకారం. తాడేపల్లి మండలం పెనుమాక గ్రామానికి చెందిన తెనాలి చరణ్ (21) అదే గ్రామానికి చెందిన చిన్నారి అనే మహిళను 9 నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. వేరే కాపురం ఉంటున్న ఇరువురూ నిత్యం గొడవపడుతుండే వారు. కాగా ఈ నెల 19న ఇలానే గొడవపడి చరణ్ ఇంటిలోకి వెళ్లి తలుపు గడియపెట్టుకున్నాడు. ఇలా చేయడం మామూలే అని ఎవరూ పట్టించుకోలేదు. ఎంతకి బయటకు రాకపోవడంతో కిటికిలో నుంచి చూడగా చరణ్ ఉరేసుకుని కనిపించాడు. తలుపులు పగులగొట్టి అతడిని హుటాహుటిన ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే చరణ్ మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. మృతుని తల్లి మాణిక్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ఖాజావలి తెలిపారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో మంగళవారం 15.92 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. నాలుగు వందల క్యూసెక్కుల నీరు లీకుల ద్వారా దిగువ కృష్ణకు విడుదల అవుతుందన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.05 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

51,209 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 52,273 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 51,209 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 7,316 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9500	13000
నెంబరు. 5	10000	13400
273	9800	12800
341	10000	13500
4884	---	---
సూపర్ 10	-----	---
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	14000
షార్క్-1	-----	----
బ్యాడిగి	10000	12400
దేవనూరు డీలక్స్	10000	12500

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఆర్మూరు	9600	11000
ఏసీ కామన్ వెరైటీ		
334	9500	12500
నెంబరు. 5	10000	13600
273	---	---
341	10000	13600
4884	10000	12700
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	13800
బ్యాడిగి	10000	12500
దేవనూరు డీలక్స్	10000	12600
తాలుకాయలు	4500	7000

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె



విద్యార్థుల కోరికకు ఓకే చెబుతున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ (ఫైల్)

విద్యార్థులు అడిగారు... ఎమ్మెల్యే అమలు చేశారు

● వ్యాయామ ఉపాధ్యాయురాలి నియామకంపై వేగేశనకు కృతజ్ఞతలు

బాపట్ల,జూలై 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో చరిత్ర కలిగిన సరస్వతీ మెమోరియల్ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలకు పీఈటీ లేక విద్యార్థులు ఆటలలో వెనుకబడి ఉన్నారు. ఈనెల 10న పాఠశాలలో నిర్వహించిన మెగాపేరెంట్స్ అండ్ టీచర్స్ సమావేశంలో బాలికలంతా కలిసి తమ పాఠశాలకు వ్యాయామ ఉపాధ్యాయరాలిని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థినులంతా ఒకేసారి ఎమ్మెల్యేను ముక్తకంఠంతో అడగటంతో ఓకే చెప్పిన ఎమ్మెల్యే ప్రభుత్వ నియామకం చేపట్టే వరకు ఒక వ్యాయామ ఉపాధ్యాయురాలిని ఏర్పాటు చేసి ప్రతినెల తానే జీతం ఇస్తానని చెప్పారు. చెప్పిన మాట ప్రకారం పాఠశాలకు వ్యాయామ ఉపాధ్యాయరాలిని నియమించారు. దీంతో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే నరేంద్రవర్మకు కృతజ్ఞతలు తెలిపారు.

చెత్తరహిత పట్టణాలలో బాపట్లకు ప్రథమస్థానం

● మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి



జి.రఘునాథరెడ్డి

బాపట్ల, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛభారత్-స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛసర్వేక్షన్‌లో భాగంగా చెత్తరహిత పట్టణాలలో జిల్లాలో బాపట్ల పురపాలక సంఘం మొదటి స్థానం సాధించినట్లు కమిషనర్ జి.రఘునాథరెడ్డి తెలిపారు. అదేవిధంగా రాష్ట్ర స్థాయిలో 28వ స్థానంలో నిలిచిందన్నారు. దీనికి సహకరించిన వారికి కమిషనర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ విషయమై మంగళవారం ఆయన మాట్లాడుతూ కలెక్టర్ జె.వెంకటమురళి ఆదేశాల మేరకు ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ఆధ్వర్యంలో పట్టణాన్ని మరింత పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు చేపడుతామన్నారు. ప్రజలు దీనికి సహకరించి తడి, పొడి, హానికర వ్యర్థాలను వేర్వేరుగా అందజేయాలని కోరారు. చెత్తను రోడ్లపై ఎక్కడపడితే అక్కడ వేయకుండా నివాసాలలో ఉంచి పారిశుధ్య కార్మికులకు అందజేయాలన్నారు. పట్టణంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించటం జరిగిందని దీనిని ఎవరు ఉపయోగించరాదన్నారు. ప్లాస్టిక్ రహిత బాపట్లగా తీర్చిదిద్దటానికి ప్రజలు బాధ్యతతో ఉండాలన్నారు. బహిరంగ ప్రదేశాలలో మూత్ర,మల విసర్జన చేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పరిశుభ్రత విషయంలో పట్టణాన్ని మరింత ముందుకు తీసుకెళ్ళి స్వచ్ఛంగా చేస్తామని కమిషనర్ తెలిపారు.

వివేకానందకాలనీ డ్రెయినేజిలలో పూడికతీత

బాపట్ల, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : గడిచిన 8 సంవత్సరాలుగా డ్రెయినేజిలో సిల్ట్, పూడికను తొలిగించకపోవటంతో 23వ వార్డు వివేకానందకాలనీ వాసులు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. ఈ విషయాన్ని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి దృష్టికి తీసుకెళ్ళగా ఆయన స్పందించి వెంటనే పూడికతీత పనులు మంగళవారం చేపట్టారు. దుర్గంధపూరితంగా మారిన డ్రైనేజిలను శుభ్రం చేయించారు. మురుగునీరు ముందుకు ప్రవహించే విధంగా చర్యలు చేపట్టారు. కాలనీవాసుల వినతి మేరకు సమస్యను స్వయంగా పరిశీలించి తగు చర్యలు చేపట్టటంతో ఆ ప్రాంత ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. శానిటేషన్ పనులు ముమ్మరం చేయాలని కమిషనర్ ఆదేశించారు. కార్యక్రమంలో శానిటరి ఇన్‌స్పెక్టర్ సి.హెచ్. కరుణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఏఆర్‌టీ సెంటర్‌లో వైరల్ లోడ్ క్యాంప్

బాపట్ల, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల లింక్ ఏఆర్‌టీ సెంటర్‌లో మంగళవారం వైరల్ లోడ్ క్యాంప్ నిర్వహించారు. కార్యక్రమంలో 37 మంది హెచ్ఐవితో జీవించే లబ్దిదారులు పాల్గొన్నారు. వైరల్ లోడ్ పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమం రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి నెల జిల్లాలో 22వ తేదీన ఇంటిగ్రేటెడ్ హెల్త్ కాంపెయిన్ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జానీబాషా, ఏరియా వైద్యశాల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సిద్దార్థ, కౌన్సిలర్ స్వాములు, వీరాంజనేయులు, హేమలత, అతల్యారాణి, గ్రామసిరి సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకుడిగా రఘునంద



కలెక్టర్ జె.వెంకటమురళికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రఘునంద

బాపట్ల, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల జిల్లా చేనేత జౌళి సంక్షేమ శాఖ సహాయ సంచాలకులుగా ఎస్.రఘునంద పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మంగళవారం కలెక్టర్ జె.వెంకటమురళిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఇటీవల చీరాల చేనేతలు నేచిన చీరలకు జాతీయ స్థాయి అవార్డు వచ్చిన నేపథ్యంలో చేనేత జౌళీశాఖకు అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న నేపథ్యంలో రఘునంద బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆయనకు అభినందనలు తెలియజేశారు.

ఇమ్యూనైజేషన్‌పై వైద్యాధికారులకు శిక్షణ

బాపట్ల, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల విస్తరణా శిక్షణా కేంద్రంలో వైద్యాధికారులకు ఇమ్యూనైజేషన్‌పై మూడురోజుల శిక్షణా తరగతులు ఏర్పాటు చేశారు. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సీహెచ్‌సీ, ఏరియా హాస్పటల్ వైద్యాధికారులకు నిర్వహించిన శిక్షణకు డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ ముఖ్యఅతిథిగా పాల్గొని టీకాల ప్రాధాన్యత గురించి వివరించారు. ఎప్పుడు ఏ టీకా వేయాలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ రత్నంమన్మోహన్, డబ్ల్యూహెచ్‌వో సర్వేలైన్స్ అధికారి డాక్టర్ మౌనిక, సీహెచ్‌వో నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ విజయమ్మ

మాతృ మరణాలపై సమావేశం

బాపట్ల, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వైద్య, ఆరోగ్యశాఖా కార్యాలయంలో మంగళవారం మాతృ మరణాలు, ఎంటిపి కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ ఎస్.విజయమ్మ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ టీనేజి ప్రెగ్నెన్సీ వలన కలుగు అనర్థాలు గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి నెల గర్భవతికి అన్నిరకాల పరీక్షలు చేయాలన్నారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ రత్నమన్మోహన్, కమిటీ సభ్యులు డాక్టర్ రామకృష్ణ హనుమాన్, డాక్టర్ సుజాత లక్ష్మీ, డాక్టర్ సునీత, డాక్టర్ శ్రీరామ్మూర్తి, డాక్టర్ రాజేష్, రాజా సాల్మన్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ

బాపట్ల, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముత్తాయిపాలెం మండలపరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు తాతా వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులు నోట్‌పుస్తకాలు పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గురజాల శ్రీనివాసరావు అధ్యక్షతన మంగళవారం జరిగిన కార్యక్రమంలో వెంకటేశ్వరరావు కుటుంబం తరుపున తాతా కోటేశ్వరరావు 5 రకాల నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్ళు 49 మంది విద్యార్థులకు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ మూడు సంవత్సరాలుగా పేద విద్యార్థులకు ఈవిధంగా సాయం చేయటం అభినందనీయమన్నారు. దాతల సహకారంతో పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమాదేవి, వందనకుమారి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శాకంబరిదేవిగా శ్రీ కాళికమ్మ

కర్లపాలెం, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం సెంటర్‌లో ఉన్న శ్రీకాళీకమ్మ వీరభద్రస్వామి దేవాలయంలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని మంగళవారం రాత్రి భక్తులు శ్రీ వీరభద్రస్వామిని, శ్రీకాళీకమ్మని పలురకాల కూరగాయలతో శాకంబరిదేవిగా విశేషంగా అలంకరించారు.

మార్గదర్శులు సేవాదృక్పథంతో పని చేయాలి

● ప్రత్యేక అధికారి నాగిరెడ్డి



పెరవలి గ్రామసభలో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి నాగిరెడ్డి

వేమూరు జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసేవే పరమావధిగా తలంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రవేశ పెట్టిన పీ-4 ఆలోచన విధానాన్ని అవగతం చేసుకుని మార్గదర్శులైన వారు సేవా దృక్పథంతో పని చేయాలని ప్రత్యేక అధికారి నాగిరెడ్డి సూచించారు. మండలంలోని పెరవలి గ్రామంలో పీ-4 కార్యక్రమం అమలులో భాగంగా మంగళవారం రాత్రి గ్రామసభను నిర్వహించారు. సభకు హాజరైన ప్రత్యేక అధికారి మాట్లాడుతూ, మార్గదర్శకుల ఎంపిక విషయంలో అధికారులు మంచి ఆలోచనతో ఎంపిక చేయాలన్నారు. నిరుపేదలైన వారిని బంగారు కుటుంబాల జాబితాలోకి చేర్చాలన్నారు. అలాంటి వారికి ఎలాంటి సహాయం అందించాలన్న దాన్ని గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు దాతలను ఎంపిక చేసుకుని ఆ కుటుంబాలను కానీ వారి పిల్లలను కానీ దత్తత చేసుకునే విధంగా చైతన్యపరచాలన్నారు. ఇప్పటి వరకు గ్రామంలో 17 మంది మార్గదర్శకుల ద్వారా 154 మంది పేద కుటుంబాల వారిని బంగారు కుటుంబాల జాబితాలోకి చేర్చినట్లు తనకు నివేదిక అందించారన్నారు. దీనిపై మండల స్థాయి అధికారులు పూర్తిగా పరిశీలన జరిపి ఆ కుటుంబాల వారికి ఎలాంటి అవసరాలు ఉన్నాయో గుర్తించి సహకరించాలని ఆదేశించారు. సభలో తహసీల్దార్ సుశీల, ఎంపీడీవో రవికుమార్, ఈవోపీఆర్డీ డి.శేఖర్, సొసైటీ అధ్యక్షుడు ఉక్కుర్తి నాగయ్య టీడీపీ నాయకులు దాది లక్ష్మణ్, బంగారు సూరిబాబు, సచివాలయ సిబ్బంది గ్రామస్థులు పాల్గొన్నారు.

అరవపల్లి గ్రామంలో...

రేపల్లె, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందించేందుకే పీ 4 కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని తహసీల్దార్ మోర్ల శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని అరవపల్లి గ్రామంలో జీరోప్రాపర్టీ పీ-4 బంగారు కుటుంబం సభ మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జీరో ప్రాపర్టీ కింద ఉన్న కుటుంబాలకు ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకునేందుకు మార్గదర్శకాలను జారీ చేసిందని ఈ నేపథ్యంలో పంచాయతీలోని జీరో ప్రాపర్టీ కింద ఎన్ని కుటుంబాలు ఉన్నాయన్నది విచారించి తగు న్యాయం చేయటం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ షేక్ బాషా, సర్పంచ్ బాబూ నాంచారయ్య, గ్రామస్తులు బొందలపాటి మల్లికార్జున్‌రావు, గోపీ నాయుడు, మల్లి, కోట మునేష్ పాల్గొన్నారు.

కిష్కింధపాలెంలో....

కొల్లూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : పీ-4 గ్రామ సభను తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు మంగళవారం నిర్వహించారు. మండల పరిధిలోని కిష్కింధపాలెంలో నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడుతూ, గ్రామంలో 169 బంగారు కుటుంబాలను గుర్తించినట్లు పేర్కొన్నారు. వీరికి మార్గదర్శకం చేసేందుకు 19 మంది మార్గదర్శకులను ఎంపిక చేయడం జరిగిందని చెప్పారు. గ్రామసభలో బంగారు కుటుంబాల వారు తమ సమస్యలు తెలియజేయాలని తహసీల్దార్ సూచించగా సభాముఖంగా సమస్యలను వివరించారు. ఆయా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని మార్గదర్శకులకు తహసీల్దార్ సూచించారు. సభలో టీడీపీ నాయకులు సుంకర శ్రీను, నర్రా మధు, బోయపాటి తేజ, నాయకులు, కార్యకర్తలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నల్లమోతువారిపాలెంలో...

కర్లపాలెం, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణాంధ్రప్రదేశ్ బంగారు భవిష్యత్తు పది సూత్రాలు ఒక విజన్ అని ఆర్డీవో గ్లోరియా అన్నారు. మండలంలోని నల్లమోతువారిపాలెం గ్రామంలో పీ4 బంగారు కుటుంబాల కార్యక్రమంలో మంగళవారం ఆమె పాల్గొని పలు సూచనలు చేశారు. డీపీవో కేవీఎల్ ప్రభాకరరావు, ఎంపీడీవో శ్రీనివాసరావు, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దార్ శ్రీదేవి, కార్యదర్శి షాహిని, టీడీపీ నాయకులు మాడా శ్రీనివాసరావు, మునిపల్లె చిన్న, బంగారు కుటుంబాల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



పీ4 బంగారు కుటుంబాల కార్యక్రమంలో పాల్గొన్న ఆర్డీవో గ్లోరియా

పోతనకట్టవారిపాలెం, కోమలిలో...

పిట్టలవానిపాలెం, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : నిరుపేద కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వం బంగారు కుటుంబాలుగా అభివృద్ధి చేసేందుకు మార్గదర్శికుల సహకారం ఎంతో అవసరమని ఆంధ్రప్రదేశ్ ప్రణాళిక సంఘం బృందం అన్నారు. మండలంలోని పోతనకట్టవారిపాలెం, కోమలి గ్రామపంచాయతీలో మంగళవారం ఆయా గ్రామ సర్పంచ్‌లు యెనుముల పార్వతి, శ్యామలానాగిరెడ్డిల అధ్యక్షతన బంగారు కుటుంబాలు, మార్గదర్శికులు సమావేశం నిర్వహించారు. ఆయా గ్రామాలకు ముఖ్యఅతిథులుగా రాష్ట్ర ప్రణాళిక సంఘం డైరెక్టర్‌లు రాంబాబు, గోపాల్ వేర్వేరు గ్రామసభలలో పాల్గొని బంగారు కుటుంబాలకు ప్రభుత్వపరంగా ఆర్థిక స్థితి గతులు లేనివారికి మౌలిక సదుపాయాలు అందించేందుకు మార్గదర్శికులను భాగస్వాములను చేస్తున్నట్లు వారు తెలిపారు. పోతనకట్టవారిపాలెంలో 120 మంది, కోమలి గ్రామంలో నలుగురిని గుర్తించినట్లు, ప్రభుత్వపరంగా వారికి సహాయ సహకారాలు అందించేందుకు ఈ పీ4 సర్వే కార్యక్రమమని వారు తెలిపారు. గ్రామసభలలో తహసీల్దార్ డి.వెంకటేశ్వరరావు, డిప్యూటీ ఎంపీడీవో ఎ.ఏలీషాబాబు, కార్యదర్శులు, మండల, గ్రామ స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాముని జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

● తపోవనం పీఠాధిపతులు వాసుదేవనందస్వామి

బాపట్ల, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : రామాయణం మన జీవితంలో ఒకభాగం చేసుకొని శ్రీరాముని జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని తపోవనం పీఠాధిపతులు వాసుదేవనందస్వామి తెలిపారు. మండలంలోని కంకటపాలెం గ్రామంలో తిరుమల-తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచారపరిషత్ ఉమ్మడి గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో శ్రీవాణిట్రస్ట్ ఆర్థికనిధులతో సమరసత సేవాఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం ధార్మిక కార్యక్రమాలు ప్రారంభించారు. 5 రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమానికి వాసుదేవానందస్వామి అనుగ్రహబాషణం చేశారు. టీటీడీ ప్రోగ్రామ్ ఆఫీసర్ అమ్మడు మాట్లాడుతూ ఉపన్యాస కార్యక్రమాలు, భజన సంకీర్తనలు, కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సహకన్వీనర్ రాయపూడి అంకమ్మచౌదరి, ధర్మప్రచారక్ జంజనం హేమశంకరరావు, మోదడుగు సూరిబాబు, అర్చకులు ఒంటినేని శ్రీనివాసరావు, అనూష, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



ధార్మిక కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న తపోవనం పీఠాధిపతులు వాసుదేవనందస్వామి

శ్రీబగళాముఖిని దర్శించుకున్న సిద్దిపేట పోలీసు కమిషనర్

పిట్టలవానిపాలెం, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రం సిద్దిపేట పోలీసు కమిషనర్ అనురాధ శ్రవణకుమార్‌రెడ్డి దంపతులు కుటుంబ సమేతంగా విచ్చేసి శ్రీ బగళాముఖి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. వారికి ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేసి దుశ్శాలువాలతో పూలమాలతో సత్కరించి సారె, ప్రసాదం అందజేశారు. భక్తుల ప్రసాదాల కొరకు రూ.25,116 విరాళంగా సమర్పించారని ఈవో తెలిపారు. సీఐడీ ఎస్పీ ఎల్.ఈశ్వరరావు శ్రీ బగళాముఖి అమ్మవారికి పూజ కార్యక్రమాలు నిర్వహించుకున్నారు.



అనురాధ, శ్రవణ్‌కుమార్‌రెడ్డి దంపతులకు శ్రీబగళాముఖి అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహామూర్తి

వీర్లంకమ్మతల్లికి ఆషాఢ మాస సారె

కర్లపాలెం, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండలం నాగరాజుపాలెంలో ఉన్న శ్రీకోదండరామస్వామిని రెడ్డి సంఘం నాయకులు తుమ్మ పోలిరెడ్డి దంపతులు, గ్రామ సర్పంచ్ మస్తాన్‌బి ఖాసీం దంపతులు మంగళవారం దర్శించుకొని పూజా కార్యక్రమాలు నిర్వహించుకున్నారు. గ్రామదేవత వీర్లంకమ్మ తల్లికి ఆషాఢ మాసం పురస్కరించుకొని ఆషాఢ మాస చీరె, పసుపు, కుంకమలు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీర్లంకమ్మతల్లి గుడి నిర్మాణానికి సహకరిస్తామని ఇరువురు దంపతులు తెలియజేశారు.



వీర్లంకమ్మతల్లికి ఆషాఢ మాస సారె, పసుపు, కుంకుమ సమర్పిస్తున్న భక్తులు

చేనేత కార్మికుల నిరసన

చెరుకుపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మంగళవారం ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో చెరుకుపల్లి తహసీల్దార్ కార్యాలయం ముందు చేనేత కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రజాతంత్ర చేనేత సంఘం నాయకుడు మరివాడ వెంకట్రావు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే చేనేత కార్మికుల సమస్యలు తీర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కె.సీతారామయ్య, వీరప్రసాద్, కౌతరపు వెంకటరమణ, కె.రామకృష్ణ, గోలి వీరరాఘవయ్య, దివి హేమంద్ర, కోటేశ్వరరావు, వీరమోహన్‌రావు, పంచుమర్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



చెరుకుపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న చేనేత కార్మికులు

అంగన్‌వాడీ సెంటర్ల ఆకస్మిక తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న రాధామాధవి

చెరుకుపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాంబొట్లపాలెం, పగడంవారిపాలెం అంగన్‌వాడీ సెంటర్లను జిల్లా మహిళా, శిశు సంక్షేమశాఖ అధికారిణి డి.రాధామాధవి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిస్టర్లు, రికార్డులు తనిఖీ చేసి అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయా పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేసి తగు సలహాలు, సూచనలు ఇచ్చారు.

ఘనంగా దాశరథి శత జయంతి వేడుకలు

బాపట, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : సామాజిక రుగ్మతలు దూరం చేయటానికి దాశరథి కృష్ణమాచార్యులు సాహిత్యం అనే రుద్రవీణను మీటి అగ్నిదారులు కురిపించారని, ఆంధ్ర కవితా సారధి దాశరథి అని సాహితిభారతి అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ అన్నారు. బాపట్ల సాహితి భారతి ఆధ్వర్యంలో రచయిత దాశరథి 100వ జయంతి ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సభలో సాహితిభారతి కోశాధికారి ఆదంషఫీ, ఉపాధ్యక్షుడు మర్రి మాల్యాద్రిరావు సంయుక్తంగా మాట్లాడుతూ దాశరథి దాదాపు 300 పై చిలుకు సినిమాలకు 2 వేలకు పైగా పాటలు రచించి తెలుగు సినీ సాహిత్యాన్ని సుసంపన్నం చేశారన్నారు. అనంతరం దగ్గుమల్లి శామ్యూల్, కామరాజు కాళీదాసు, కస్తూరి శ్రీనివాసరావు, బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి, రచయితలు తదితరులు దాశరథి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

కర్లపాలెం, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని ఎంపీ రాజుపాలెంలో గల హైస్కూల్‌లో గ్రామప్రజలకు బాలల హక్కులు, బాల్యవివాహాల నిర్మూలన అనే అంశంపై మంగళవారం అవగాహన కల్పించారు. చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ జి.కృష్ణ మాట్లాడుతూ బాలల హక్కులు, బాల్య వివాహాల వలన జరిగే నష్టాలు, 1098 పిల్లల ఎమర్జెన్సీ టోల్‌ఫ్రీ నెంబరుపై వివరించారు. బాల్య వివాహాల నిర్మూలన ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎం.నాగమల్లేశ్వరి, ఎస్‌ఏఫ్ఆర్‌డీ డిస్ట్రిక్ కో ఆర్డినేటర్ కిషోర్, స్కూల్ ప్రధానోపాధ్యాయులు విజయభాస్కర్, శ్రీనివాసరావు, అంగన్‌వాడీ కార్యకర్తలుపాల్గొన్నారు.

మద్యం వ్యసనంతో వ్యక్తి మృతి

కర్లపాలెం, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండలంలోని పేరలి గ్రామానికి చెందిన దేవరంపాటి చంటి (40) మద్యం సేవించి పెదగొల్లపాలెం మద్యం షాపు సమీపంలో మృతి చెందాడని ఎస్ఐ రవీంద్ర తెలిపారు. చంటి భార్య గత 10 సంవత్సరాలు నుంచి దూరంగా ఉండటంతో చంటి మద్యానికి బానిసై మద్యం సేవించి మృతి చెందాడని ఎస్ఐ చెప్పారు. తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించామని ఎస్ఐ తెలిపారు.

సీఎం చంద్రబాబు ఆదేశించినా పెంచని పెన్షన్

● అధికారుల చుట్టూ 12 నెలలుగా తిరుగుతున్న వైనం



దివ్యాంగుడు చలమయ్య

రేపల్లె, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : వీల్‌చైర్‌కే పరిమితమైన తమ కుమారుడికి దివ్యాంగుల పింఛన్ రూ.6 వేలు మాత్రమే వస్తుందని దానిని రూ.15 వేలకు పెంచాలని చెరుకుపల్లి గ్రామానికి చెందిన కొర్నిపాటి చలమయ్య తల్లిదండ్రులు వరప్రసాద్, పార్వతిలు తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును జూన్ 29 2024న కలిశారు. స్పందించిన ముఖ్యమంత్రి పూర్తిస్థాయిలో దివ్యాంగుడిగా ఉన్న చలమయ్యకు రూ.15 వేలు పెన్షన్ మంజూరు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. నేటికి 14 నెలలు గడిచిన పూర్తి పెన్షన్ మంజూరు చేయలేదంటూ తండ్రి వరప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ కార్యాలయానికి 8 నెలల నుంచి తిరుగుతున్నామని, ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని పెన్షన్ పెంచి ఇవ్వాలని వేడుకున్నా ఫలితం లేదన్నారు. పద్మశాలీయ కుటుంబానికి చెందిన తాము రోజుకూలీ పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నామని, కుమారుడి వైద్య ఖర్చులు, కుమార్తె చదువుకు డబ్బులు సరిపోక నానా ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న తమ కుమార్తెకు తల్లికివందనం నగదు పడలేదని, దయ ఉంచి పూర్తి స్థాయి పింఛన్, తమ కుమార్తెకు తల్లికివందనం ఇప్పించాలని వేడుకుంటున్నారు.

అంగన్‌వాడీలు సమయపాలన పాటించాలి : సీడీపీవో



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో లక్ష్మీదేవి

కొల్లూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కార్యకర్తలు కేంద్రాల నిర్వహణలో సమయపాలన పాటించాలని అమృతలూరు ప్రాజెక్టు ఐసీడీఎస్ సీడీపీవో లక్ష్మీదేవి అన్నారు. కొల్లూరులోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం ప్రాజెక్టు సమావేశం నిర్వహించారు. సీడీపీవో మాట్లాడుతూ, సీబీ ఈవెంట్లను ప్రతి నెలా రెండుసార్లు కేంద్రాల్లో నిర్వహించాలన్నారు. ప్రభుత్వం ద్వారా సరఫరా అవుతున్న పౌష్టికాహారాన్ని కేంద్రం పరిధిలోని లబ్దిదారులందరికి సకాలంలో అందించాలన్నారు. విధుల్లో అలసత్వం వహించే కార్యకర్తలను సహించబోనని హెచ్చరించారు. ఎఫ్ఆర్ఎస్ ద్వారా టీహెచ్ఆర్ పంపిణీ చేయాలన్నారు. ప్రీస్కూల్ పిల్లలకు పీపీ-1, 2 రైమ్స్ బోధించాలన్నారు. పోషణ వాటికలో భాగంగా కూరగాయలు, ఆకు కూరలు పెంచాలని కార్యకర్తలకు సూచించారు. కార్యకర్తలు నూతనంగా విధులు చేపట్టిన సీడీపీవో, సూపర్‌వైజర్లను పూలబొకేలు, దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రజని, ఫజిరున్నీసా, అమృతవాణి, సునీత, విజయలక్ష్మి, నాంచారమ్మ, సంపూర్ణ, పద్మావతి, శకుంతల, ఐదు మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

డెంగీపై అవగాహన అవసరం

● మలేరియా సబ్ యూనిట్ అధికారి ఉమాకాంత్



ర్యాలీలో పాల్గొన్న వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది

వేమూరు జూలై 22 (ఆంధ్రజ్యోతి) : డెంగీపై అవగాహన ఎంతో అవసరమని తెనాలి సబ్ యూనిట్ మలేరియా విభాగం అధికారి శ్రీకంఠ ఉమాకాంత్ అన్నారు. మండలంలోని జంపని గ్రామంలో డెంగీ నివారణ మాసోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కూచిమంచి బద్రినారాయణ సహకారంతో నిర్వహించిన కార్యక్రమంలో ముందుగా గ్రామంలో ర్యాలీ, అనంతరం ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దోమలు వాటి రకాలు వాటి ద్వారా వ్యాపించే వివిధ రకాల వ్యాధులను తెలియజేశారు. పెరవలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరోగ్య విస్తరణ అధికారి పున్నారావు, తెనాలి గ్రామీణ సబ్ యూనిట్ అధికారి వంగల పున్నారెడ్డి, ఉపాధ్యాయులు రాంబాబు, వెంకటరామయ్య, పెరవలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పర్యవేక్షకురాలు శోభారాణి, విలేజ్ హెల్త్ సెక్రటరీలు మాధవి, ఝాన్సీరాణి, ఎంఎల్‌హెచ్‌పీ దివ్య, ఆశా కార్యకర్తలు సుమతి, లత, సుభాషిణి, బుజ్జి, కరుణకుమారి, కుష్బు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులు ఈక్రాప్ నమోదు చేయించుకోవాలి



సభలో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ ఏడీఏ లక్ష్మి

రేపల్లె, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ సీజన్‌లో ప్రతి ఒక్క రైతు ఈక్రాప్‌నమోదు చేయించుకోవాలని వ్యవసాయ శాఖ ఏడీఏ లక్ష్మి తెలిపారు. మండలంలోని పోటుమెరక, కైతేపల్లి గ్రామాల్లో మంగళవారం పొలంపిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్నదాతసుఖీభవ స్కీమ్‌కు సంబంధించి 23వ తేదీ వరకు గ్రీవెన్స్ నమోదు చేయించుకోవచ్చని తెలిపారు. అనంతరం రైతుల సందేశాలను నివృత్తిచేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారి ఎ.మహేష్‌బాబు, ఏఈవో సుమన్, వీఆర్‌వో రాంబాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పెరవలి, పెరవలిపాలెం గ్రామాల్లో...

వేమూరు జూలై 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెరవలి, పెరవలిపాలెం గ్రామాల్లో మంగళవారం మండల వ్యవసాయాధికారి ప్రేమ్‌సాగర్ అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అర్హులైన రైతులకు అన్నదాత సుఖీభవ పథకం వర్తిస్తుందన్నారు. అర్హత కలిగి జాబితాలో పేర్లు లేని రైతులు బుధవారం సాయంత్రం లోగా రైతు సేవా కేంద్రాలలో అన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఖరీఫ్ సాగుకు సంబంధించి అనేక సూచనలు చేశారు. ఈ సమావేశంలో వీఏఏలు సుబ్బారావు, కళ్యాణి, పావని, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులు రాణించాలి

● అడవులదీవి ఎస్ఐ బాబూరావు



గుడ్, బ్యాడ్ టచ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ బాబూరావు

నిజాంపట్నం(రేపల్లె), జూలై 22 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు, తల్లిదండ్రులు కన్న కలలను సాకారం చేసే దిశగా విద్యలో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అడవులదీవి ఎస్ఐ బాబూరావు అన్నారు. మండలంలోని కొత్తపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌పై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. చెడువ్యసనాలకు బానిసకాకుండా సెల్‌ఫోన్‌ల బారిన పడకుండా విద్యలో రాణించాలని సూచించారు. విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు కూడా నిఘా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

అచ్యుతానందన్ మృతి సీపీఎంకి తీరనిలోటు

రేపల్లె, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : కేరళలో వివిధ పోరాటాలకు నాయకత్వం వహించి సమర్థవంతమైన కమ్యూనిస్టు నాయకుడు మాజీ ముఖ్యమంత్రి వీఎస్ అచ్యుతానందన్(101) మృతి బాధాకరమని సీపీఎం రేపల్లె ఏరియా కార్యదర్శి సీహెచ్ మణిలాల్ అన్నారు. ఆయన చిత్రపటానికి మంగళవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కేవీ లక్ష్మణ్‌రావు, వై.కిషోర్, ఆశీర్వాదం, నవీన్, రమేష్, డానియేలు, రామకృష్ణ ప్రసాద్, ఎం.వెంకటేశ్వరరావు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

కడకు కన్నీరైంది


కొండవాగు వరదతో చెరువులను తలపిస్తున్న జాలాది పంట పొలాలు

యడ్లపాడు, జూలై 22(ఆంధ్రజ్యోతి): తొలకరి.. సాగుకు ముందే ముఖం చాటేశా యి. దీంతో తొలి విడత నాటిన విత్తనాలు మొలకెత్తకుండానే బొగిలిపోయాయి. జూలై సగం గడిచినా వర్షాలు లేక డీలాపడిన రైతులు.. వాతావరణశాఖ చల్లని కబురుతో మరోసారి పొడిన దుక్కిలో విత్తనాలు వేసుకున్నారు. శుక్రవారం 28.8 మి.మీలు, ఆది వారం 14.2 మి.మీ వర్షపాతం నమోదైంది. దీంతో విత్తనం మొలక వస్తుందని ఆశించిన రైతుల ఆశలను సోమవారం కురిసిన 33 మి.మీల కుండపోత అడియాసలు చేసింది.


లింగారావుపాలెం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న నక్కవాగు (తూర్పువాగు)

ఉధృతంగా ప్రవాహం

ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మండలంలోని నక్కవాగుతో పాటు ఉప్పు వాగు కూడా వరద నీటితో నిండుగా ప్రవహిస్తు న్నాయి. లింగారావుపాలెం పడమర వాగు పొంగడంతో వరద నీరు సొలస, చిరుమామిళ్ల రోడ్డుపై నుంచి ప్రవహించాయి. వరద నీరు గ్రామంలోకి వస్తుందేమోనని గ్రామస్తులు పొద్దు పోయే వరకు జాగారం చేశారు. వరుణుడు శాంతించడంతో ఉధృతి తగ్గుముఖం పట్టి.. గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

కొండ వరదతో మునకేసిన పొలాలు

ఎగువన కురిసిన వర్షాలకు తోడు కొండల పైనుంచి వచ్చిన ప్రవాహం తోడై లోతట్టు గ్రామాలైన జాలాది, తుర్లపాడు, గణేశు నివారిపాలెం గ్రామాల పరిధిలోని పంట పొలాలు మునకేశాయి. దీంతో ఆయా గ్రామాల్లోని పొలాలకు గండ్లు పడడంతోపాటు, అప్పటికే వివిధ రకాల విత్తుకున్న విత్తనాలు మొలకెత్తకుండా పోయాయి. ఎటు చూసినా కనుచూపు మేరలో నీరే కనిపించడంతో రైతులకు కన్నీరే మిగిలింది.


యడ్లపాడు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న ఉప్పువాగు


గాజుల్లంక-శ్రీకాకుళం తాత్కాలిక మార్గం తూముల కింద నుంచి ప్రవహిస్తున్న వరద నీరు

వరద ఉధృతి పెరిగితే మార్గం మాయం!

కొల్లూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కృష్ణానదిలో వరద నీరు ప్రవహిస్తోంది. ఇటీవల ప్రకాశం బ్యారేజీ ఎగువన కురిసిన వర్షాలతో బ్యారేజీ నీటి మట్టం 12 అడుగులు దాటడంతో దిగువకు మంగళవారం 10 వేల క్యూసెక్కుల వరద నీటిని విడుదల చేశారు. దీంతో కొల్లూరు మండలం సుగ్గునలంక, గాజుల్లంక గ్రామాల వద్దకు కృష్ణా నదిలో వరద నీరు సాయంత్రానికి చేరింది. గాజుల్లంక నుంచి శ్రీకాకుళం వెళ్లేందుకు నదిలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన గాలు మార్గం కింద తూముల నుంచి వరద నీరు ప్రవహిస్తోంది. 20 వేల క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తే ఈ తాత్కాలిక గాలు మార్గం వరద నీటి ఉధృతికి కొట్టుకుపోయే ఆస్కారం ఉంది. గత ఆరేడు నెలలుగా తాత్కాలిక మార్గం నుంచి ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. వరద నీటితో మార్గం కొట్టుకుపోతే ద్విచక్ర వాహనదారులు పడవలను ఆశ్రయించాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు లారీలు, నాలుగు చక్రాల వాహనాలు కూడా గాలు మార్గం ద్వారా కృష్ణా, బాపట్ల జిల్లాలకు రాకపోకలు సాగించాయి. మార్గం తెగిపోతే ఆయా వాహనాలు పెనుమూడి వారధి మీదుగా శ్రీకాకుళం, పామర్రు, గుడివాడ, మచిలీపట్నం ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. దీంతో దూరాభారం పెరుగుతుంది.

ఉప సంఘంలో..మంత్రులు
అనగాని, నాదెండ్ల

జిల్లాల సరిహద్దులు, పేర్ల మార్పులకు క్యాబినెట్ సబ్ కమిటీ

త్వరలో జిల్లాల్లో పర్యటించే అవకాశం

గుంటూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాం లో అశాస్త్రీయంగా జరిగిన జిల్లాల పునిర్వభజనను సరి చేసేందుకు కూటమి ప్రభుత్వం నియమించిన మంత్రుల బృందంలో ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి ఇద్దరికి చోటు లభించింది. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాదు, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ క్యాబినెట్ సబ్ కమిటీలో కీలక పాత్ర పోషిం చనున్నారు. కమిటీలో మొత్తం ఏడుగురు ఉండగా జిల్లా నుంచి ఇద్దరు ఉండటం విశేషం. ముఖ్యంగా పల్నాడు, బాపట్ల జిల్లాల్లో అసంబద్ధంగా రెవెన్యూ డివిజన్ల విభజన, కొత్తవి ఏర్పాటు జరి గాయి. గుంటూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉన్న కొన్ని మండ లాలను తీసుకెళ్లి తెనాలిలో కలిపారు. దీనిపై ఆయా మండలాల ప్రజలు అభ్యంతరాలు చెబుతున్నారు. లోక్‌సభ నియోజకవర్గం ప్రాతిపదికగా చేసుకొని జిల్లాల విభజన చేయడం సరికాదని అప్పట్లోనే ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేశారు.

గతంలో ఇలా..

గత ప్రభుత్వం 2022 ఏప్రిల్ నెల మొదటి వారంలో జిల్లాల పునిర్వభజన చేసింది. ఉమ్మడి గుంటూరు జిల్లా కొత్త గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలుగా విభజితమైంది. గుంటూరు జిల్లాని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలైన గుంటూరు తూర్పు, పశ్చిమ, పొన్నూరు, తెనాలి, మంగళగిరి, తాడికొండ, ప్రత్తిపాడుకు పరిమితం చేశారు. పల్నాడు జిల్లాని పెదకూరపాడు, సత్తెనపల్లి, నరసరావుపేట, వినుకొండ, మాచర్ల, చిలకలూరిపేట, గురజాలతో ఏర్పాటు చేశారు. బాపట్ల జిల్లాని బాపట్ల, వేమూరు, రేపల్లె, చీరా ల, పర్చూరు, సంతనూతలపాడు, అద్దంకితో కలిపి ఏర్పరిచారు. జిల్లాల విభజన కోసం రేపల్లె, సత్తెనపల్లిలో కొత్త డివిజన్‌లు నెలకొల్పారు. అయితే కొన్ని మండలాలు ఏర్పాటు చేసిన డివిజన్ హెడ్ క్వార్టర్స్‌కు దూరంగా ఉన్నాయి. మరోవైపు ఇతర డివిజ న్లకు దగ్గరగా ఉండటంతో ప్రజలు అసంతృప్తికి గురవుతున్నారు. అలానే ఒకే అసెంబ్లీ నియోజకవర్గంలో ఉన్న మండలాలు కొన్ని ఒక డివిజన్‌లో మరికొన్ని వేరే డివిజన్‌లో ఉండటంతో ప్రజాప్రతి నిధులు కూడా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. బాపట్ల జిల్లా ఏర్పాటు విషయంలో అక్కడి ప్రజాప్రతినిధులు అనేక అభ్యంత రాలను అప్పట్లో లేవనెత్తారు. అయినప్పటికీ వైసీపీ ప్రభుత్వం అవేమి పట్టించుకోకుండా ముందుకు సాగింది.

అమరావతి జిల్లా ఏర్పాటుకు డిమాండ్

అమరావతి రాజధాని ప్రస్తుతం గుంటూరు జిల్లాలో ఉంది. అయితే ఇది గుంటూరు హెడ్ క్వార్టర్స్‌కు 35 కిలోమీటర్ల దూరం లో ఉండటంతో పరిపాలన పరంగా కొన్ని సమస్యలు తలెత్తుతు న్నాయి. ముఖ్యంగా సీఎం, డిప్యూటీ సీఎంతో పాటు మంత్రులు, సీనియర్ ఐఏఎస్ అధికారుల రాకపోకలు రాజధానిలో ఎక్కువగా ఉంటున్నాయి. రాష్ట్రస్థాయి ప్రజాప్రతినిధులు, అధికారులు పా ల్గొనే సమావేశాలకు గుంటూరు జిల్లా కలెక్టర్, ఇతర అధికారులు ప్రొటోకాల్ పాటించాల్సి వస్తోంది. అలానే సభలు, సమావేశాల ఏర్పాట్లను కలెక్టర్, ఎస్పీ ఇతర అధికారులు చూసుకోవాలి. దీంతో ఇక్కడ పరిపాలనలో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ నేపథ్యంలో అమరావతిని ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఉంది. వీటన్నింటిపై మంత్రుల బృందం ఏ మేరకు చర్యలు తీసుకొంటుందో చూడాలి.

కందుల డబ్బులు ఎప్పుడు
పేడతాయబ్బా..!

జిల్లా వ్యాప్తంగా పడుతున్న వర్షాలు

ఖరీఫ్ సాగు ఖర్చులకు రైతుల ఎదురుచూపులు

పిడుగురాళ్ల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కంది డబ్బులు కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. ఆరుగాలం పంట దిగుబడి కోసం కష్టపడిన అన్నదాతలు.. ఇప్పుడు విక్రయించిన పంట నగదు కోసం దిగులు పెట్టు కున్నారు. గురజాల నియోజకవర్గంలో ఈ ఏడాది ఖరీఫ్, రబీలో కంది పంటను సుమారు 25 వేల ఎకరాలలో సాగు చేశారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి మార్క్‌ఫెడ్ ద్వారా కంది కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. క్వింటాకు సుమారు రూ.7,500కు కొనుగోలు చేశారు. నెల తర్వాత జిల్లాకు ఇచ్చిన టార్గెట్‌ను మించిపోవడంతో నెలపాటు కొనుగోళ్లను నిలిపివేశారు. అప్పటికే రైతుల ఇళ్లకు గోనె సంచులు చేరడం, మరికొంత మందికి సంబంధించి కందులను తూకం వేయడంతో ఆందోళన వ్యక్తమైంది. మార్క్‌ఫెడ్ అధికారుల సూచనలతో రాష్ట్ర, కేంద్ర స్థాయి అధికారులు స్పందించి తిరిగి కొనుగోలు సామర్థ్యాన్ని పెంచారు. గత నెలలోనే మార్క్‌ఫెడ్ అధికారులు కందుల నిల్వలను కొనుగోలు చేశారు. గురజాల నియోజకవర్గం వ్యాప్తంగా సుమారు 150 మంది రైతుల ఖాతాలకు రూ.50 వేల నుంచి రూ.3 లక్షలు పైగా నగదు జమ కావాల్సి ఉంది.

నగదు జమ అయితే...

ప్రస్తుతం వర్షాలు పడుతున్నాయి. రైతులు వివిధ పంటల సాగుకు సన్నద్ధమవుతున్నారు. రైతులు పెట్టుబడి ఖర్చులకు బయటి వ్యక్తులు, బ్యాంక్‌లను ఆశ్రయించకుండా ఉండాలంటే.. కొనుగోలు చేసిన కందులకు వెంటనే నగదు జమ కావాలి. మార్క్‌ఫెడ్ అధికారులు స్పందించి కంది నగదును వెంటనే రైతుల ఖాతాలకే జమ అయ్యే విధంగా చూడాలని రైతులు కోరుతున్నారు.



రైతుల వద్ద కొనుగోలు చేసిన కందుల బస్తాలు

ఇప్పుడు ఎంతో అవసరం : కుర్రా కోటయ్య, రైతు



ప్రస్తుతం పంట సాగుకు చేతిలో డబ్బు ఎంతో అవసరం. కందులు విక్రయించినా నగదు జమ కాకపోవడంతో కాస్త ఆందోళనగా ఉంది. బయట వ్యక్తులను ఆశ్రయించాల్సిన అవసరం ఏర్పడేటట్లు ఉంది. ఇప్పుడు నగదు అందిస్తే అవసరానికి ఉపయోగపడతాయి.

మార్క్‌ఫెడ్ అధికారులు స్పందించాలి : ఆంజనేయులు, రైతు



కొనుగోలు చేసిన కందులకు నగదును వెంటనే జమచేసే విధంగా మార్క్‌ఫెడ్ అధికారులు స్పందించాలి. అధికారులను అడిగితే నగదు, బ్యాంక్ వివరాలను ప్రభుత్వానికి, బ్యాంక్‌లకు పంపించామని, త్వరలోనే నగదు జమ అవుతాయని చెబుతున్నారు.

453.32 కేజీల గంజాయి ధ్వంసం


పట్టుబడిన గంజాయితో ఎక్సైజ్ శాఖ అధికారులు

● గుంటూరు, పల్నాడు జిల్లాల్లో పట్టివేత

గుంటూరు కార్పొరేషన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని వివిధ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లో పలు కేసుల్లో దొరికిన 453.32 కేజీల గంజాయిని యడ్లపాడు మండలం నాయుడుపేట డంపింగ్ యార్డ్ వద్ద ధ్వంసం చేసినట్లు మంగళవారం గుంటూరు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె.శ్రీనివాసులు తెలిపారు. ఉన్నతాధికారుల సమక్షంలో గంజాయిని పూర్తిగా తగలబెట్టినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ అధికారులు కుమార్ రెడ్డి, దయాసాగర్, సుధాకర్ రెడ్డి, పర్యావరణ ఇంజనీర్ నజీనా బేగం, అరుణ కుమారి, మణికంఠ పాల్గొన్నారు.

సెప్టెంబరు 29 నుంచి..
శబరి ప్రయాణ సమయం మార్పు

గుంటూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): శబరి ఎక్స్‌ప్రెస్‌ని సూపర్ ఫాస్టుగా మారుస్తూ రైల్వేబోర్డు ఇటీవల నిర్ణయం తీసుకొన్న దృష్ట్యా సెప్టెంబరు 29 నుంచి ఈ రైలు ప్రయాణ సమయం మారిపోనుంది. 17229 తిరువనంతపురం - సికింద్రాబాద్ శబరి ఎక్స్‌ప్రెస్ 20630 నంబరుగా మారుతుంది. ఈ రైలు తిరువనంతపురంలో సాయంత్రం 6.45కి బయలుదేరి తిరుపతికి రాత్రి 11.15కి, చీరాలకు వేకువజామున 4.08, బాపట్లకు 4.23, నిడుబ్రోలుకు 4.58, తెనాలికి 5.28, గుంటూరుకు ఉదయం 6.20, సత్తెనపల్లికి 7.09, పిడుగురాళ్లకు 7.34, నడికుడికి 7.54, చర్లపల్లికి 10.29, సికింద్రాబాద్‌కు 11 గంటలకు చేరుకొంటుంది. 17230 సికింద్రాబాద్ - తిరువనంతపురం శబరి ఎక్స్‌ప్రెస్ 20629గా మారుతుంది. ఈ రైలు నిత్యం మధ్యాహ్నం 2.25కి బయలుదేరి సాయంత్రం 5.19కి నడికుడి, 5.39కి పిడుగురాళ్ల, 6.14కి సత్తెనపల్లి, రాత్రి 6.50కి గుంటూరు, 7.48కి తెనాలి, 8.03కి నిడుబ్రోలు, 8.23కి బాపట్ల, 8.38కి చీరాల, అర్ధరాత్రి దాటాక 1.33కి తిరుపతి, మరుసటి రోజు సాయంత్రం 6.20కి తిరువనంతపురం చేరుకొంటుంది.

సేవ, నిజాయితీగా
విధులు నిర్వహించాలి

● ప్రొబేషనరి ఎస్‌ఐలకు రేంజ్ ఐజీ త్రిపాఠి సూచన


ప్రొబేషనరి ఎస్ఐలకు దిశా నిర్దేశం చేస్తున్న ఐజీ సర్వ శ్రేష్ఠత్రిపాఠి

గుంటూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): నిబద్ధత, నిజాయితీ, అంకితభావం, సేవా తత్పరతలతో విధులు నిర్వహించాలని ప్రొబేషనరి ఎస్‌ఐలకు రేంజ్ ఐజీ సర్వ శ్రేష్ఠ త్రిపాఠి సూచించారు. శిక్షణ పూర్తి చేసుకున్న 53 మంది ప్రొబేషనరి ఎస్‌ఐలు మంగళవారం మర్యాదపూర్వకంగా రేంజ్ కార్యాలయంలో ఐజీని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ, నేర పరిశోధన, సాంకేతిక పరిజ్ఞానం, పోలీసింగ్‌లో ఎదురయ్యే సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు ఎప్పటికప్పుడు అవగాహన పెంపొందించుకోవాలన్నారు. రికార్డులు, స్థానిక చట్టాలు, భౌగోళిక పరిస్థితులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. సహచర ఉద్యోగులు, ప్రజలతో విశ్వాసపూర్వక సంబంధాలు కలిగి ఉన్నప్పుడే సమర్థవంతమైన పోలీసింగ్ సాధ్యమవుతుందన్నారు. గుంటూరు జిల్లా నుంచి 23 మంది, పల్నాడు నుంచి 13, బాపట్ల నుంచి 10, ప్రకాశం నుంచి ఒకరు, నెల్లూరు, తిరుపతి నుంచి ముగ్గురు చొప్పున శిక్షణ పూర్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ ఏడుకొండలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమరావతి రైలు మార్గానికి..
భూములిస్తాం!

● నష్టపరిహారం ఎంత ఇస్తారో చెప్పాలి ● భూ సమీకరణ అయితే ఎక్కడ ప్లాట్లు ఇస్తారు ● కొప్పురావూరులోని కొంతమంది రైతులు జేసీకి నివేదన

గుంటూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానికి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన రైలు మార్గానికి అవసరమైన భూములు ఇచ్చేందుకు సిద్ధమని పెదకాకాని మండలంలోని కొప్పురావూరుకు చెందిన రైతులు పేర్కొన్నారు. అయితే ముందు తమకు ఎంత నష్టపరిహారం ఇస్తారో స్పష్టం చేయాలని కోరారు. అలానే ఒక వేళ భూ సమీకరణ పథకం కింద భూములు తీసుకొనేట్లు అయితే తమకు రిటర్న్ బుల్ ప్లాట్స్ ఎక్కడ, ఎప్పటిలోపు ఇస్తారో కూడా చెప్పాల న్నారు. భూ సేకరణ కాంపిటెంట్ అథారిటీ అయిన జాయింట్ కలెక్టర్ జారీ చేసిన నోటీసులకు సమాధానం ఇచ్చేందుకు రైతులు మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌కు వచ్చి జేసీని కలిసి చర్చించారు. అనంతరం రైతులు మీడియాతో మాట్లా డారు. తమకున్న అనుమానాలను వ్యక్తపరుస్తూ వాటిని నివృత్తి చేయాలన్నారు.

'తాడికొండ మండలంలోని కంతేరుని ఆనుకొనే కొప్పురావూరు ఉంది. ఈ గ్రామం భూసేకరణ ప్రాజెక్టులతో పూర్తిగా నిర్వీర్యమైపోతుంది. ఇప్పటికే ఒక రైలుమార్గం ఉంది. ఇప్పుడు మరొక రైలు మార్గం వేస్తామంటున్నారు. అలానే ఆ రెండు మార్గాలను కలుపుతూ మరో లైను వేస్తామంటున్నారు. ఇంకో వైపు బైపాసు, ఓఎన్‌జీసీ పైపులైను వేస్తామంటున్నారు. వీటి వల్ల మేము బలవుతున్నాం. మేము జేసీని కలిశాం, అయితే మాకు ఏమి చేస్తారో చెప్పడం లేదు. మేము ప్రభుత్వానికి వ్యతిరేకం కాదు. రైల్వేలైను, గ్యాస్ లైనుకు సపోర్టు చేస్తాం. మమ్మల్ని తీవ్ర గందరగోళంలో పడేసి పెగ్ మార్కింగ్ వేస్తాం.. అప్పుడు చూద్దామంటున్నారు. ఇది ఎంతవరకు సమంజసం' అని రైతులు ప్రశ్నించారు.

అమరావతి రాజధాని కోసం తెలంగాణలోని ఎర్రుబాలెం నుంచి కృష్ణానది, రాజధాని గ్రామాల మీదగా నంబూరు వరకు ఒక రైలుమార్గాన్ని కేంద్రం మంజూరు చేసింది. దీనికి సంబంధించి గుంటూరు జిల్లా వరకు భూసేకరణ అధికారిగా జేసీని నియమించింది. గత ఏడాదే భూసేకరణ నోటిఫికేషన్లను జారీ చేసి రైతుల నుంచి అభ్యంతరాలను తెలపాల్సిం దిగా కోరారు. కొప్పురావూరు రైతులు ఇప్పటికే ఒకటి, రెండు దఫాలు తమ ఆవేదనని కలెక్టర్‌కు నివేదించారు. తాజాగా మంగళవారం జేసీ ఎదుట హాజరు కావాలని వచ్చిన నోటీసులకు సమాధానంగా రైతులు వచ్చి జేసీని కలిసి తమ అభ్యంతరాలను తెలిపారు.


కలెక్టరేట్‌లో జేసీకి తమ అభ్యంతరాలను తెలిపి బయటకు వస్తున్న కొప్పురావూరు రైతులు

ఆరోగ్యానికి
సప్తవర్ణాల సూత్రం!

●సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో ఏడు రంగుల దుప్పట్లు ●వార్డుల్లో పడకలు మరింత శుభ్రంగా


సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలోని మంచాల పై బెడ్ షీట్లు పరుస్తున్న దృశ్యం

సత్తెనపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స పొందే రోగులకు వైద్యంతో పాటు.. పారిశుభ్ర వాతావరణం చాలా అవసరం. ఇందుకు కూటమి ప్రభుత్వం సప్తవర్ణాల సూత్రం అమలుకు నిర్ణయం తీసు కుంది. దీంతో ఆస్పత్రుల్లోని వార్డుల్లో పడకలపై రోజుకొక రంగుతో.. వారం రోజులూ ఏడు రంగుల దుప్పట్లు మార్చ నున్నారు. రోగులు, ఉద్యోగులు ఇబ్బందులు పడకుండా ఇంద్రధనస్సు తరహాలో సప్త వర్ణాల దుప్పట్లు వేసేందుకు నిధులు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో పడకల సంఖ్య ఆధారంగా రంగు రంగుల దుప్పట్లు ఇవ్వనున్నారు. ఆదివారం నుంచి శనివారం వరకు ఒక్కో రోజు ఒక్కో రంగు దుప్పటి వేయనున్నారు. 30, 50, వంద పడకల ఆస్పత్రులు, జిల్లా, ప్రాంతీయ ఆస్పత్రులు వైద్య విధాన పరిషత్ పరిధిలో ఉంటాయి. వీటిలో సంస్కరణలు అమలయ్యేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వార్డుల్లో పడకలు మరింత పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ఆదేశాలిచ్చింది.

బాలింతలకు మేలు..

వైద్యశాలకు వచ్చే గర్భిణులు సాధారణ ప్రసవాలు ఐతే మూడు రోజులు, సిజేరియన్ జరిగితే తొమ్మిది రోజులు ఆస్పత్రిలో ఉంటారు. ఇంకా వివిధ రకాల జబ్బులతో ఆస్పత్రికి వచ్చే రోగులు రోగాన్ని బట్టి వారం రోజుల వరకు ఆస్పత్రుల్లోనే ఉంటారు. ప్రస్తుతం వినియోగిస్తున్న తెలుపు రంగు దుప్పట్ల స్థానంలో వారంలో ఏడు రోజులు ఏడు రంగుల దుప్పట్లను ఏర్పాట్లు చేయనున్నారు. ప్రస్తుతం ఆస్పత్రుల్లో మంచాలకు వాడుతున్నవన్నీ తెలుగు రంగు దుప్పట్లు, పునర్వినియోగం లేని నీలి రంగు బెడ్ షీట్లు మాత్రమే. వైరల్ ఇన్‌ఫెక్షన్, ఇతర అత్యవసర పరిస్థితిని బట్టి డిస్పోజల్ బెడ్ షీట్లు వాడుతుంటారు. తెలుపు దుప్పట్లపై రక్త, ఇతర మరకలు ఉంటే ఉతికినవి అయినా. మళ్లీ వాడేందుకు ఇబ్బందికరంగా ఉంటాయి. ఈ క్రమంలో సదరు రోగులు ఇళ్ల నుంచి దుప్పట్లు తెచ్చి వేసుకుం టున్నారు మరికొందరు బాగున్నవి వేయాలంటూ సిబ్బందితో వాగ్వాదానికి దిగుతున్నారు.



సత్తెనపల్లి ఏరియా వైద్యశాల

సముచిత నిర్ణయం



ఆస్పత్రికి వచ్చే రోగులు ఇక్కడి వాతావరణం ఎంత బాగుంటే అంత త్వరగా కోలుకుంటారని సత్తెనపల్లి ఏరియా వైద్యశాల ఇన్‌చార్జ్ ఆర్ఎంవో డాక్టర్ కృష్ణమూర్తి పేర్కొన్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో రోగులకు మేలు జరుగుతుందన్నారు. ఏ రోజు ఏ రంగు వాడలో ముందే నిర్ణయించడం సముచితమన్నారు.

-డాక్టర్ కృష్ణమూర్తి, ఇన్‌చార్జ్ ఆర్ఎంవో, సత్తెనపల్లి ఏరియా వైద్యశాల

అవీ..ఇవీ..

విద్యార్థులకు అభ్యసన సామగ్రి అందజేత


పుస్తకాలను అందజేస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

బల్లికురవ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంటుపల్లి ప్రాథమిక పాఠశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ మార్టురు ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు అభ్యసన సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉన్న 43 మంది విద్యార్థుల చదువుకు అవసరమైన పలు రకాల పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు మాదాల సాంబశివరావు, గోనుగొంట్ల రవికుమార్, తాళ్లూరి సాంబశివరావు, చల్లగుండ్ల శ్రీనివాసరావు, పాఠశాల హెచ్ఎం ఏడుకొండలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బంగారు కుటుంబాలకు అర్హులను గుర్తించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో కుసుమకుమారి

బల్లికురవ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న పీ-4 కార్యక్రమంలో భాగంగా గ్రామాలలో ఇంకా ఎవరైన బంగారు కుటుంబాల కింద నమోదు కాని వారు ఉంటే వెంటనే నమోదు చేసి వారికి మార్గదర్శకులను ఏంపిక చేయాలని ఎంపీడీవో కుసుమకుమారి కోరారు. మంగళవారం మండలంలోని వేమవరం గ్రామంలో పీ-4 కార్యక్రమంలో భాగంగా సచివాలయ సిబ్బందితో ఎంపీడీవో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హత లేని వారు ఎవరైన బంగారు కుటుంబాల కింద నమోదైతే వెంటనే వారి పేర్లను తొలగించాలన్నారు. రానున్న రోజుల్లో బంగారు కుటుంబాలకు మార్గదర్శకులుగా ఉన్న వారి నుంచి చేయూత అందించే చర్యలు చేపడతామన్నారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి గణేష్, వీఆర్వో రవి తదితరులు పాల్గొన్నారు.

అద్దంకిటౌన్ : ప్రభుత్వం చేపట్టిన పీ4 సర్వేకు సంబంధించి గ్రామంలో బంగారు కుటుంబాల గుర్తింపు, ఆ కుటుంబాల అభివృద్ధిలో అందరు భాగస్వాములు కావాలని ఎంపీడీవో బత్తిన సింగయ్య అన్నారు. మంగళవారం మండలంలోని బొమ్మనంపాడు గ్రామంలో జరిగిన పీ4 సర్వేపై జరిగిన గ్రామ సభలో ఎంపీడీవో పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గోర్లంట పద్మావతి, ఎంపీటీసీ కామేపల్లి నాగ్రేందమ్మ, గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఔషధ మొక్కల విలువను గుర్తించాలి


మొక్కలను పరిశీలిస్తున్న ఎన్ఎంపీబీ అధికారుల బృందం

అద్దంకిటౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఈతరం విద్యార్థులు ఔషధ మొక్కల విలువలను గుర్తించాలని, నేషనల్ మెడిసిన్ ప్లాంట్ బోర్డు (ఎన్ఎంపీబీ) ప్రాజెక్ట్ మేనేజర్ డాక్టర్ యూవీఎం చంద్రశేఖర్, కన్సల్టెంట్ పి.చిరంజీవిలు అన్నారు. బుధవారం మండలంలోని ధర్మవరం, శంఖవరప్పాడు జెడ్పీహెచ్ఎస్‌లో పెంచుతున్న హెర్బల్ గార్డెన్‌లను పరిశీలించారు. అందులో పెంచుతున్న వివిధ రకాల ఔషద మొక్కలను పరిశీలించి వాటి ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. హెర్బల్ గార్డెన్‌లు విద్యార్థులలో ప్రకృతి, ఆ రోగ్యంపై ప్రేమను పెంచుతాయన్నారు. ఇది భవిష్యత్తులో సమాజానికి ఆరోగ్యాన్ని అందించే మార్గంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ఏ.శ్రీనివాసరావు, ఐఈఈఆర్‌డీ ప్రాజెక్టు సమన్వయకర్త బత్తుల కిరణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అద్దంకిలో డ్రోన్‌తో పోలీసుల నిఘా


డ్రోన్ నిఘాలో ఆర్టీసీ బస్టాండ్

అద్దంకి, జూలై22 (ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలో పోలీసులు డ్రోన్‌తో నిఘా ఏర్పాటు చేశారు. ప్రధానంగా బ్యాంకులు, ఆర్టీసీ బస్టాండ్, నామ్ రోడ్డు లో రద్ధీ ప్రాంతాలతో పాటు శివారు ప్రాంతాలలో డ్రోన్‌తో పర్యవేక్షిస్తూ, నిఘా ఉంచినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు. అనుమాన స్పదంగా ఉన్న వ్యక్తులను అదుపులోకి తీసుకొని ప్రశ్నించడం, దొంగతనాల నివారణకు, ట్రాఫిక్ రద్ధీని గుర్తించేందుకు నిఘా చేపట్టడం జరుగుతుందన్నారు.

డ్రైవర్‌కు తీవ్రగాయాలు


ఆగి ఉన్న లారీని ఢీ కొన్న ట్రాలీ ఆటో

మేదరమెట్ల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి వెంబడి గుడిపాడు- కొరిశపాడు మధ్యలో గాజు ఫ్యాక్టరీ వద్ద రోడ్డు అంచులో ఆగి ఉన్న లారీని ట్రాలీ ఆటో ఢీ కొట్టింది. ఈ ఘటనలో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. మంగళవారం బెంగుళూరు నుంచి విజయవాడ వైపు వెళ్తున్న ఐసర్ లారీ డ్రైవర్ రోడ్డు అంచులో వాహనాన్ని నిలిపాడు. అదేరోడ్డులో వస్తున్న ట్రాలీ ఆటో డ్రైవర్ గులాం రోడ్డు అంచులో అగి ఉన్న లారీని ఢీ కొన్నాడు. తమిళనాడు రాష్ట్రం నాగూర్‌కోయి గ్రామానికి చెందిన డ్రైవర్ గులాం లారీని ఢీ కొన్న ఘటనలో తీవ్రంగా గాయపడ్డాడు. గ్రాయపడిన డ్రైవర్ గులాంను అంబులెన్స్‌లో వైద్యశాలకు తరలించారు. మేదరమెట్ల పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

నాగండ్లలో అవయవదానం

ఇంకొల్లు,జూలై 22,(ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగండ్లలో అవయవదానం, నేత్రదానం నిర్వహించారు. గ్రామానికి చెందిన కోట నాగేశ్వరరావు(64) మరణాంతరం తమ దేహాన్ని దానం చేయాలని కుటుంబసభ్యులకు చెప్పారు. దీంతో ఇంకొల్లు రోటరీ అవయవదాన కమిటీ ఆధ్వర్యంలో అవయవాలను గుంటూరు కాటూరి మెడికల్ కళాశాలకు, నేత్రాలను శంకర్ కంటి వైద్యశాలకు దానం చేశారు. నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు లక్ష్మీకుమారి, శ్రీనివాసరావు, వంశీకృష్ణ, భాగ్యలక్ష్మీ, సుబ్రహ్మణ్యంలను రోటరీ అవయవదాన కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోహనరావు, జెట్టి వెంకటేశ్వర్లు, అడ్వకేట్ రావి సత్యనారాయణ, వీరగంధం ఆంజనేయులు, వెంకటేశ్వర్లు తదితరులు అభినందించారు.

ప్లాస్టిక్ మహమ్మారిని తరిమికొడదాం

- ఎమ్మెల్యే ఎంఎం.కొండయ్య
- వ్యాపారులు, పురప్రముఖులతో సమావేశం
- పీ-4కు మార్గదర్శకులు ముందుకురావడంపై హర్షం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎం.కొండయ్య

చీరాల, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : చీరాలలో ప్లాస్టిక్ మహమ్మారిని తరిమి కొట్టి, గ్రీన్ చీరాలగా తీర్చి దిద్దుదామని ఎమ్మెల్యే కొండయ్య పిలుపునిచ్చారు. మంగళవారం మున్సిపల్ సమావేశం హాలులో చైర్మన్ మించాల సాంబశివరావుతో కలిసి పట్టణం లోని వ్యాపారులు, పురప్రముఖులతో ప్లాస్టిక్ నిషేధంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలో ప్లాస్టిక్ వినియోగం పెరిగి మూగజీవాలు అసువులు బాస్తుండడంతో పాటు, చాపకింద నీరులా ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నట్లు వివరించారు. మరో రెండు మాసాల్లో పూర్తి స్థాయిలో నిషేదాజ్ఞలు అమల్లోకి వస్తాయన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా ప్లాస్టిక్ నియంత్రణకు సహకరించాలని కోరారు. అలాగే పీ-4కు మార్గదర్శకులుగా స్వచ్ఛందంగా దాతలు ముందుకు రావడంతో ఎమ్మెల్యే వారిని ప్రత్యేకంగా అభినందించారు. అంతకుముందు కొద్ది రోజులుగా సమస్యల పరిష్కారం కోరుతూ సమ్మె చేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులకు నిమ్మరసం ఇచ్చి విరమింప చేశారు. ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ పొత్తూరి సుబ్బయ్య, మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, డీఈ రఘురామ్, తదితరులు పాల్గొన్నారు.

చీరాల : అది వైసీపీ పార్టీ చీప్ పార్టీ అని ఎమ్మెల్యే కొండయ్య అన్నారు. వైసీపీ మాజీ మంత్రి రోజా అధికార పార్టీ ఎమ్మెల్యేలపై చేసిన అసభ్యకర వ్యాఖ్యలపై ఎమ్మెల్యే కొండయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. 11 సీట్లుకు పరిమితమైన ఆ పార్టీ నేతలకు బుద్ధి రాలేదన్నారు. తప్పులు తెలుసుకుని ప్రజల నమ్మకాన్ని చూరగొనాల్సింది పోయి, మహిళ నేతలతో జగన్‌రెడ్డి అసభ్యకరంగా మాట్లాడించడం ఆ పార్టీకి సిగ్గుచేటన్నారు. సాక్షాత్తు రక్తం పంచుకొని పుట్టిన సోదరిని తల్లిని బయటకు నెట్టేసిన జగన్‌ది నీచపు సంస్కృతి అని వ్యాఖ్యానించారు. రోజా నోరు అదుపు చేసుకోవాలని సూచించారు. రోజా తన గత చరిత్ర తెలుసుకొని మాట్లాడాలని హితవు పలికారు. అలాగే కూటమి మహిళ నేతలు గడియార స్తంభం కూడలిలో రోజా చిత్ర పటాలను దహనం చేశారు.

వరద ఉధృతికి 'సాగి' వాగుకు గండ్లు


ఉధృతంగా ప్రవహిస్తున్న సాగివాగు

పర్చూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ఎగువన కురిసిన వర్షాలకు, సాగి వాగులో వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. కొన్ని ఏళ్లుగా వైసీపీ ప్రభుత్వ హయాంలో మరమ్మతులకు నోచుకోక పోవడంతో ఈ వాగులో చిల్లచెట్లు దట్టంగా పెరిగాయి. దీంతో నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతోంది. వరద ఉధృతంగా రావడం, నీటి సరఫరా సక్రమంగా జరగక పోవడంతో సాగి వాగు కాలువకు పలుచోట్ల గండ్లు పడ్డాయి. దీంతో వరద నీరు సమీప పొలాల్లోకి ప్రవహిస్తుండడంతో ఎటు చూసినా సముద్రాన్ని తలపించేలా పంటపొలాలు ఉన్నాయి. ప్రస్తుతం పైర్లు సాగుచేయక పోవడంతో రైతులు కొంత ఊపిరి పీల్చుకున్నా, వరద ఉధృతికి పొలాలు కోతకు గురవుతున్నాయని, రైతుల ఆందోళన చెందుతున్నారు. సాగి వాగు అభివృద్ధిలో నిర్లక్ష్యం తమ పాలిట శాపంగా మారిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాల ప్రారంభంలోనే వాగు పరిస్థితి ఇలా ఉంటే, పైర్లు సాగుచేసిన తర్వాత పరిస్థితి పునరావృతం అయితే పంటలు కోల్పోయి తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు సమీప గ్రామాలు కూడా ముంపుకు గురికావాల్సి వస్తుందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. పర్చూరు నియోజకవర్గ పరిధిలోని యద్దనపూడి మండలంలో మొదలయ్యే సాగి వాగు పర్చూరు మండలం తిమ్మరాజుపాలెం, అడుసుమల్లి, రమణాయపాలెం, మీదుగా చెరుకూరును కలుపుకొని బాపట్ల సమీపంలో సముద్రంలో కలుస్తుంది. వాగు పరిస గ్రామాల్లో వేల ఎకరాలకు వరద ప్రమాదం ఉన్న నేపథ్యంలో సంబంధిత అధికారులు స్పందించి తక్షణ మరమ్మతు లకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. వేసవిలో చేపట్టాల్సిన పనులు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహించడం వల్లే తమకు ఇలాంటి పరిస్థితి దాపురించిందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధింత డ్రైనేజ్ అధికారులు సాగి వాగు అభివృద్ధితోపాటు, గండ్లనుపూడ్చి వరద ముంపుకు పంట పొలాలు గురికాకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆదిశగా అధికారులు చర్యలు చేపట్టాలి.

అధికారుల నిర్లక్ష్యం వల్లే పరిస్థితి ఇలా

సాగు వాగుకు పలుచోట్ల గండ్లు పడి వేల ఎకరాల్లో పంటలు ముంపుకు గురిఅయ్యే పరిస్థితి నెలకొన్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. గత వైసీపీ పాలకుల నిర్లక్ష్యం వల్లే వాగు అభివృద్ధికి నోచుకోలేదు. ఇదే పరిస్థితి కొనసాగితే వేల ఎకరాలు పంట పొలాలు ముంపుకు గురికావటంతోపాటు, ఆయా గ్రామాలకు కూడా వదర నీటి ముంపు వచ్చే ప్రమాదం ఉంది. అధికారులు తక్షణం స్పందించి చర్యలు చేపట్టాలి.

కారుమంచి పాపారావు

సహకార రంగ అభివృద్ధిలో సొసైటీలదే కీలక పాత్ర


రైతులతో మాట్లాడుతున్న డాక్టర్ సీతారామయ్య

మేదరమెట్ల, జూలై 22(ఆంధ్రజ్యోతి): సహకార రంగం అభివృద్ధిలో సొసైటీలదే కీలక పాత్ర అని ప్రకాశం జిల్లా పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య అన్నారు. మంగళవారం రావినూతల వచ్చిన సీతారామయ్య ముందుగా సెంట్రల్ బ్యాంక్ శాఖను పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. అనంతరం రాష్ట్రంలోనే గుర్తింపు కలిగిన రావినూతల సొసైటిని ఆయన పరిశీలించారు. సొసైటీ చైర్మన్ మొపర్తి వెంకట్రావు సొసైటీలో జరుగుతున్న ఎరువుల వ్యాపారం, రేషన్ దుకాణం, బట్టల దుకాణం గురించి వివరించడంతో పాటు సొసైటీ పూర్వ చరిత్రను వివరించారు. ఎన్.టీ.రామారావు ముఖ్యమంత్రిగా రావినూతల నూతన సొసైటి భవనాన్ని ప్రారంభించడంతో పాటు కిలో రెండు రూపాయల బియ్యం పథకాన్ని ఇక్కడ నుంచే ప్రారంభించారని సీతారామయ్యకు వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాలను ఆయనకు చూపించారు. రైతులకు అ వసరమైన పంటరుణాలను మంజూరు చేయడం ద్వారా ఆర్థికంగా అభివృద్ధికి సహకరించినట్లు అవుతుందన్నారు. సొసైటిలలో రైతులు ఎక్కువ డిపాజిట్‌లు చేయాలని, రావినూతల రైతులను జిల్లాలోని రైతులందరు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీడీసీసీ బ్యాంక్ రావినూతల మేనేజర్ శ్రీనివాసరావు, సొసైటీ సీఈవో నవనీ, సొసైటి కమిటి సభ్యులు చేబ్రోలు నాగేశ్వరరావు, నాదెండ్ల తిరుపతిరావు, రైతులు పాల్గొన్నారు.

బల్లికురవలో వీధిశునకాల స్వైర విహారం



బల్లికురవలో రోడ్డుపై ఉన్న వీధికుక్కలు

బల్లికురవ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వీధి శునకాలు గుంపులు గుంపులుగా తిరుగుతూ హల్‌చల్ చేస్తున్నాయి. వీటిని చూసిన ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ప్రతిరోజు పాఠశాలలు కళాశాలలకు వచ్చే విద్యార్థులైతే ఈ శునకాలను చూసి అవి వెళ్లే వరకు వేచి ఉంటున్నారు. వారం రోజుల నుంచి వీధి శునకాల సంఖ్య బాగా పెరిగిందని ఎదో గ్రామం నుంచి మండల కేంద్రానికి శునకాలు వచ్చాయని ప్రజలు అంటున్నారు. అధికారులు వెంటనే ఈ వీధి శునకాలను పట్టించాలని ప్రజలు కోరుతున్నారు. బల్లికురవ మండల కేంద్రం నాలుగు రోడ్ల జంక్షన్‌లో వీధి శునకాలు ప్రజలను భయపెడుతున్నాయి. వీధుల వెంట వరుసగా శునకాలు వస్తుంటే ప్రజలు భయం భయంగా వాహనాలను నడుపుతున్నారు. శునకాలను దాటే వరకు నెమ్మదిగా భయపడుతు వెళుతున్నారు. రాత్రుళ్ల అయితే వాహనాల వెంట శునకాలు పడుతున్నాయని దీంతో ప్రమాదాలు జరుగు తున్నాయని ప్రయాణికులు అంటున్నారు. అధికారులు వెంటనే మండల కేంద్రంతో పాటు మిగిలిన గ్రామాలలో కూడా ప్రజలకు ఇబ్బందిగా ఉన్న వీధి శునకాలను పట్టించి అడవులలో వదిలి పెట్టే చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పొగాకుకు ప్రత్యామ్నాయంగా అపరాలు సాగుచేసుకోవాలి


మాట్లాడుతున్న ఏడీఏ ఎఫ్రాయం

అద్దంకిటౌన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది రైతులు నల్లబర్లీ పొగాకు సాగు చేయవద్దని, రైతులు ప్రత్యామ్నాయ పంటలుగా అపరాలను సాగుచేయాలని ఏడీఏ ఎఫ్రాయం సూచించారు. మంగళవారం మండలంలోని బొమ్మనంపాడు, జార్లపాలెం గ్రామాలల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల పరిధిలో సాగుచేస్తున్న పంటలను రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతు ప్రస్తుతం పండించిన పొగాకును ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని, తేమ శాతం 20లోపు ఉండాలన్నారు. ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ మాట్లాడుతూ 23వ తేదీతో అన్నదాత సుఖీభవ పథకం ఫ్రెన్స్ నమోదు చేసుకునే అవకాశం పూర్తవుతుందన్నారు. అర్హులైన రైతులు గ్రామ వ్యవసాయ సహాయకుల వద్ద నమోదు చేయించుకోవాలన్నారు. రైతులకు ఉచితంగా కందులు, మినుములు అందిస్తున్నామని సాగు చేసే రైతులు వినియో గించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారిణి ఎస్. దీప్తి, ఏఈవో కోటేశ్వరరావు, వీపీఏలు దినేష్ రైతులు పాల్గొన్నారు.

బీమా నమోదుకు 31 వరకు గడువు

యద్దనపూడి, (మార్టూరు) : ప్రత్తి, మిరప, కంది, మినుము పంటలు సాగు చేసే రైతులు పంటల బీమాలో నమోదు చేసుకోవడానికి ఈ నెల 31వ తేదీ తుదిగడువు అని పర్చూరు ఏడీఏ జి.ప్రవీణ అన్నారు. మంగళవారం యద్దనపూడి మండలంలోని చిమటావారి పాలెం, వింజనంపాడు గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏడీఏ ప్రవీణ మాట్లాడుతూ అడుసుమల్లిలో పొగాకు కొనుగోలు కేంద్రానికి పొగాకును తీసుకువెళ్లే రైతులు పాటించవలసిన నిబంధనలను రైతులకు తెలిపారు.

జేజీ- 11 రకం శనగల ధరల్లో కదలిక

ఇంకొల్లు, జూలై 22,(ఆంధ్రజ్యోతి) : జేజీ-11 రకం ఎర్రశనగల ధరలో కదలిక వచ్చింది. ఈ ఏడాది పంట చేతికందిన సమయం నుంచి క్వింటా జేజీ-11 రకం శనగలు రూ.5600 ఉంది. వారం రోజుల కిందట వరకు క్వింటా రూ.5800 మధ్య మాత్రమే ఉంది. ఈ వారం రోజులలో శనగల ధరలో కదలిక వచ్చింది. మంగళవారం క్వింటా రూ. 6300 వరకు పలికిందని వ్యాపార వర్గాలు తెలిపాయి. ఈ ఏడాది జేజీ-11 రకం శనగల సాగు తక్కువగా ఉండడంతో డిమాండు వచ్చిందని భావిస్తున్నారు. దీంతో శనగరైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది కాక్-2(తెల్లశనగలు)ధర, జెజె-11 శనగల ధర ఒక్కటే ఉండడం విశేషం. జెజీ -11 కంటే తెల్ల శనగలు కాక్-2 రకం ఏటా క్వింటాకు రెండు నుంచి మూడు వేలు అధికం ఉంటుంది. ప్రస్తుతం రెండు రకాలు ఒకే ధర పలుకుతున్నాయి. జెజీ -11 రకం శనగల నిల్వలు తక్కువగా ఉండడంతో ఈ ఏడాది మంచి ధర రావచ్చునని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఏబీసీ కాలువపై పాత వంతెన తొలగింపు

- కొత్త వంతెన ఏర్పాటు చేసే వరకు భారీ వాహనాల రాకపోకలు బంద్


పాత వంతెనను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

బల్లికురవ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వల్లాపల్లి గ్రామ సమీపంలో అద్దంకి బ్రాంచ్ కాలువపై శిథిలావస్థకు చేరిన పురాతన వంతెనను తొలగించే పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. పాతవంతెన స్థానంలో కొత్త హైలెవల్ వంతెన ఏర్పాటు అయ్యే వరకు బల్లికురవ అద్దంకి రోడ్డులో భారీ వాహనాల రాకపోకలు నిలిచిపోనున్నాయి. ఈ రోడ్డులో చిన్న వాహనాలు వెళ్లేలా ఏబీసీ కాలువపై డైవర్షన్ ఏర్పాటు చేశారు. గ్రానైట్ ముడి రాయి లారీలు మాత్రం ఈ దారిలో వెళ్లటం కష్టమని అధికారులు తెలిపారు. భారీ వాహనాలకు ప్రవేశం లేదని బోర్డులను కూడా ఏర్పాటు చేశారు. నూతన హైలెవల్ వంతెన నిర్మాణానికి మంత్రి గొట్టిపాటి రవికుమార్ కృషితో రూ. 2 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. ఈ నిధులతో రెండు మాసాల వ్యవధిలో నూతన వంతెన పనులు పూర్తయ్యేలా పనులు శర వేగంగా చేపడుతున్నారు. 1967వ సంవత్సరంలో ఏబీసీ కాలువపై ఏర్పాటు చేసి వంతెన ఇప్పటి వరకు ఎంతో నాణ్యతగా ఉంది. దీని వలన వంద టన్నుల బరువు ఉన్న గ్రానైట్ రాళ్లను ఈ దారి వెంబడి తరలించిన ఏమీ కాలేదు. నూతనంగా ఏర్పాటు చేస్తున్న వంతెన కూడా నాణ్యత ప్రమాణాల మేర నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కళాకారిణి కుటుంబానికి ఆర్థికసాయం


సాయాన్ని అందజేస్తున్న సంఘ సభ్యులు

అద్దంకిటౌన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): గాత్ర, వాద్య కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మృతి చెందిన కళాకారిణి కుటుంబానికి ఆర్థికసాయాన్ని బుధవారం అందజేశారు. అద్దంకి పట్టణంలోని పాతదావావారిపాలెంకు చెందిన గాయని, కళకారిణి పఠాన్ ఆషా (50) మంగళవారం మృతి చెందింది. ఆమె గాత్ర, వాద్య కళాకారుల సంక్షేమ సంఘం సభ్యురాలుగా ఉన్నారు. పఠాన్ ఆషా మృతదేహాన్ని సంఘ సభ్యులు బుధవారం సందర్శించి నివాళ్లులర్పించారు. ఆమె కుటుంబానికి రూ.10 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు జి. శేషగిరిరావు, తదితరులు ఉన్నారు.

మృతుని ఆచూకీ లభ్యం

మార్టూరు, జూలై22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గొట్టిపాటి నగర్ సమీపంలో మృతిచెందిన వ్యక్తి ఒడిస్సా రాష్ట్రానికి చెందిన రంజన్ బెహ్రా(36)గా గుర్తించినట్లు ఎస్ఐ సైదా మంగళవారం తెలిపారు. ఆదివారం రాత్రి గొట్టిపాటి నగర్ సమీపంలో మద్యంమత్తులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించిన విషయం తెలిసిందే. అయితే పోలీసులు విచారించగా, మృతుడు మండల పరిధిలోని జొన్నతాళి కూడలి సమీపంలోని అమరావతి నూలుమిల్లులో ఐదేళ్లుగా కార్మికునిగా పని చేస్తున్నారు. అయన భార్య మమతాబెహ్రా, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. అయితే ఆదివారం రాత్రి భార్యకు మందులు తీసుకురావడానికి మార్టూరు వచ్చిన మృతుడు మద్యం బాటిళ్లతో గొట్టిపాటి నగర్ వైపు వెళ్లినట్లు పోలీసుల విచారణలో తెలిసిందన్నారు. మృతునికి రెండేళ్లనుండి మూర్ఛ వ్యాధి ఉందని, ఈ కారణంగా మద్యం మత్తులో ఉన్న అతను మూర్ఛవ్యాధి తో మృతిచెంది ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. మంగళవారం వీఆర్‌వో కే.మోహనరావు ఫిర్యాదు మేరకు పోలీసులు ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహానికి శవపంచనామా నిర్వహించారు. అనంతరం మృతదేహానికి పోస్టుమార్టం చేయించారు. తదుపరి కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించగా, వారు మృతదేహాన్ని ప్రత్యేక వాహనంలో ఒడిస్సాకు తీసుకువెళ్లినట్లు ఎస్ఐ సైదా తెలిపారు.

ఉపాధి హామీ పనికల్పించండి సార్


వినతిపత్రం అందజేస్తున్న ఉపాధి హామీ కూలీలు

సంతమాగులూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి పనిచేసిన తమకు బిల్లులను మంజూరే చేయడం లేదని, జాబ్‌కార్డులు ఉన్నవారికి పనులు కల్పించడం లేదని సంతమాగులూరు మండలంలోని వెల్లలచెరువు గ్రామ ఉపాధి హామీ కూలీలు మంగళవారం ఎంపీడీవో జ్యోతిర్మయిని కలిసి వినతిపత్రం అందజేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. గత డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు పనులు తాలూకా బిల్లు రాలేదని చల్లగిరి శ్రీనివాసరావు అనే వ్యక్తి ఎంపీడీవో దృష్టికి తీసుకువచ్చారు. అలాగే చెన్నంనేని ఏడుకొండలు కూడా తనకు నవంబర్, డిసెంబర్ నెలలకు నగదు జమ కాలేదని చెప్పారు. అంతేకాకుండా ఫీల్డ్ అసిస్టెంట్ రూ200లను తమ వద్ద తీసుకున్నట్లు ఆరోపించారు. ఈ ఇద్దరితో పాటు రావి రాజేంద్ర, చేర్రెడ్డి శివరామకోటేశ్వరరావులు తమకు జాబ్ కార్డులు ఉన్నప్పటికీ పనులు కల్పించడం లేదని వాపోయారు. పనులకు రానివాళ్లకు మస్టర్లు వేసి, బిల్లులు మంజూరు చేశారన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. గతంలోనూ వెల్లలచెరువులో ఉపాధి పనులపై ఫిర్యాదులు వచ్చాయని, విచారణ నిమిత్తం ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని చెప్పారు. వారి ఆదేశాలు మేరకు తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

విద్యుత్‌షార్ట్‌సర్క్యూట్‌తో దుస్తుల దుకాణం దగ్ధం

మేదరమెట్ల, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మనపాలెం చెక్‌పోస్టు వద్ద నాగులుప్పాలపాడు రోడ్డులోని ట్రైలరింగ్, బట్టల దుకాణం విద్యుత్ షాట్ సర్క్యూట్ వలన మంటలు చెలరేగాయి. మంగళవారం వేకువజామున శ్రీ బాలాజీ ట్రైలరింగ్ షాపులో విద్యుత్ షాట్ సర్క్యూట్ వలన దుకాణంలో ఉన్న బట్టలు, మిషన్‌లు ఇతర సామాగ్రి దగ్ధమైనట్లు దుకాణం యజమాని ఈమని మాధవి తెలిపారు. రూ.5 లక్షలకు పైగా నష్టం వాటిలినట్లు వాపోయారు. అద్దంకి నుంచి వచ్చిన ఫైర్ సిబ్బంది మంటలను అదపు చేశారు.

విద్యుత్‌షాక్‌తో గేదె మృతి

పంగులూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌షాక్‌తో గేదె మృతిచెందిన ఘటన మంగళవారం అలవలపాడు గ్రామంలో చోటుచేసుకొంది. విద్యుత్ ప్రసరించే తీగలు తగిలి అలవల అనంతారెడ్డికి చెందిన గేదె మృతిచెందింది. గేదె విలువ రూ.50 వేలు ఉంటుందని రైతు అనంతారెడ్డి తెలిపారు. ఇలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా తగిన రక్షణ చర్యలు తక్షణమే చేపట్టాలని గ్రామస్థులు విద్యుత్ అధికారులను కోరుతున్నారు.

రేణంగివరం పాఠశాలకు కంప్యూటర్ బహూకరణ


కంప్యూటర్‌ను అందజేస్తున్న వీరనారాయణ

పంగులూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేణంగివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అజిత్ ట్రస్ట్ చైర్మన్ వడ్డవల్లి వీరనారాయణ నూతన కంప్యూటర్ బహూకరించారు. రేణంగివరం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను ఈ విద్యా సంవత్సరం నుండి ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేశారు. నూతనంగా ఏర్పడిన ఉన్నత పాఠశాలకు కంప్యూటర్ సమకూర్చిన అజిత్‌ట్రస్ట్ చైర్మన్ వీరనారాయణకు హెచ్.యం. సందిరెడ్డి శ్రీహరి కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు గింజుపల్లి శ్రీనివాసరావు, రావి చంద్రశేఖర్, ఆనందరావు, సునంద తదితరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

శ్రీనివాసాచారికి గుర్తింపు


శ్రీనివాసాచారి

అద్దంకిటౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): వరల్డ్ ఎన్ఆర్ఐ సోషల్ అండ్ కల్చరల్ అసోసియేష్ విశ్వ కుటుంబ హెడ్ ఆఫ్, ఈస్ట్ ముంబై వారి ఆంధ్రప్రదేశ్ శాఖ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అద్దంకికి చెందిన చెన్నుపల్లి శ్రీనివాసచారిని సెంట్రల్ జాయింట్ సెక్రటరీ డాక్టర్ చేతాలి విశాల్ ధర్మశ్రీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసచారి మాట్లాడుతు ప్రపంచ వ్యాప్తంగా 195 దేశాలల్లో ఆర్గనైజేషన్‌తో ఉన్న ఈ సంస్థ సనాతన ధర్మం వ్యాప్తి చెందాలనే ఉద్దేశంతో అసోసియేషన్ ఏర్పాటు చేసి ప్రతి రాష్ట్రంలో కమిటిలు ఏర్పాటు చేస్తుందన్నారు. దానిలో భాగంగానే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తనను నియమించినందుకు డాక్టర్ సత్యప్రకాష్ స్వామి గురుజీకి, పదవి రావాడనికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు చావా రామకృష్ణ, రాష్ట్ర యూత్ అధ్యక్షుడు వాకా బాల గంగాధర్‌కు, గౌరవ సలహాదారుడు పొన్నకంటి శ్రీనివసచారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ ఆర్గనైజేషన్ ద్వారా సనాతన ధర్మాన్ని కాపాడుతు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు


వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

ఇంకొల్లు, జూలై 22,(ఆంధ్రజ్యోతి) : బాపట్ల జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులుగా ఇంకొల్లు మండలం గొల్లపాలెం గ్రామానికి చెందిన వెనిగండ్ల వెంకటేశ్వర్లును నియమించినట్లు జిల్లా కార్యవర్గం ప్రకటించింది. వెంకటేశ్వర్లు గతంలో రెండు పర్యాయాలు ఇంకొల్లు మండల పార్టీ అధ్యక్షులుగా పని చేశారు. ఇంకొల్లు మండల పార్టీ ఆధ్వర్యంలో వెంకటేశ్వర్లును మంగళవారం గొల్లపాలెంలోని ఆయన గృహంలో సన్మానించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షురాలు నల్లూరి సాహితి, సీనియర్ నాయకులు నల్లూరి కృష్ణయ్య, నాదెండ్ల పార్థసారధి,పెనుమాల రామయ్య,రావి సుధాకర్,వెనిగండ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొని అభినందించారు.

అడవిపాలెంలో 'పొలం పిలుస్తోంది'

సంతమాగులూరు జులై 22(ఆంధ్రజ్యోతి) : వరిలో విత్తన శుద్ధి చేయడం ద్వారా తెగుళ్లను అదుపులో ఉంచవచ్చని బాపట్ల డాట్ సెంటర్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఆర్.బాలమురళిధర్‌నాయక్ తెలిపారు. మంగళవారం మండలంలోని అడవిపాలెం, వెల్లలచెరువు గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పంటలపై వచ్చే తెగుళ్ల గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతులు సాగు చేసిన వరి, మొక్కజొన్న పంట పొలాలను ఆయన పరిశీలించారు. వరిలో విత్తనశుద్ధికి కార్బండిజమ్ మూడు గ్రాములు, ఒక కిలో వరి విత్తనానికి కలిపి విత్తనశుద్ధి చేసి రైతులకు చూపించి అవగాహన కల్పించారు. మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు అవసరమయ్యే యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏవో షేక్ సైద, సిబ్బంది భవాని, పఠాన్ ఇమ్రాన్‌ఖాన్, ఎస్ఎస్‌పీ డిస్ట్రిబ్యూషన్ కమిటీ చైర్మన్ కామాను శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

పంటసాగులో ఆధునిక పద్ధతులు అవలంబించాలి

పంగులూరు: రైతులు పంటసాగులో ఆధునిక పద్దతులు అవలంబించాలని ఏవో డి.సుబ్బారెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని ఆరికట్లవారిపాలెం, ముప్పవరం గ్రామాలలో పొలంపిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఏవో సుబ్బారెడ్డి మాట్లాడుతూ కౌలు రైతులందరూ పంటహక్కుపత్రం పొందాలని కోరారు. దీనిద్వారా కౌలు రైతులు విత్తనాల సబ్సిడీ, పంట ఉత్పత్తులు అమ్ముకోవడం, పంటనష్ట పరిహారం పొందే అవకాశం ఉందన్నారు. సేంద్రీయ వ్యవసాయం ద్వారా తక్కువ ఖర్చుతో నాణ్యతతో కూడిన అధిక దిగుబడులు సాధించవచ్చని సూచించారు. పొగాకు పంట సాగుచేయవద్దని, అందుకు ప్రత్యామ్నాయంగా జొన్న, మొక్కజొన్న, పప్పు ధాన్యాల పంటలు సాగుచేయాలని కోరారు. కార్యక్రమంలో వీవీవో. గోపీకృష్ణ, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు మహిళ యత్నం

● రక్షించిన వన్‌టౌన్ పోలీసులు


అమలను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ఎస్సై రాజ్యలక్ష్మి

చీరాల, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : కుటుంబంలో గొడవలు సర్వసాధారణమని బలవన్మరణాలు పరిష్కారం కాదని వన్‌టౌన్ ఎస్సై రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక గంజిపాలెంకు చెందిన అమల కుటుంబంలో నెలకొన్న ఆర్థిక సమస్యల కారణంగా మనస్థాపం చెందింది. ఈనేపధ్యంలోనే వేటపాలెం రైల్వే స్టేషన్ సమీపంలో పట్టాలపై బలవన్మరణం చెందేందుకు ప్రయత్నించింది. అయితే సిఐ సుబ్బారావు ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన ఎస్సై రాజ్యలక్ష్మీ సాంకేతిక పరిజ్ఞానంతో అమలను గుర్తించి, కౌన్సిలింగ్ చేశారు. అనంతరం సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఎస్సై వెంట ఏఎస్సై సత్యన్నారాయణ ఉన్నారు.

దారి సమస్య కారణంగా వివాదం

పాపాయిపాలెం(చీరాల), జూలై 22 (ఆంధ్రజ్యోతి) : పూర్వికుల నుంచి సంక్రమించిన స్థలానికి రాకపోకల సమస్య కారణంగా పలువురిపై ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వేటపాలెం మండల పరిధిలోని పాపాయిపాలెంకు చెందిన డక్కుమళ్ల రవికుమార్‌కు పూర్వికుల నుంచి కొంత స్థలం సంక్రమించింది. అయితే అందుకు సంబంధించిన దారి విషయంలో పెదనాన్న యిర్మియా, కుమారులు పున్నారావు, నాగేశ్వరరావు దారికి అటంకం కలిగించారు. దీంతో రవికుమార్ ఫిర్యాదు మేరకు ఈపూరుపాలెం ఎస్సై చంద్రశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉనికి కోసమే వైసీపీ డ్రామాలు

అద్దంకి, జూలై22(ఆంధ్రజ్యోతి): వైసీపీ బ్యాచ్ మొత్తం లిక్కర్‌తో పాటు ఇతర స్కామ్‌లలో చిక్కుకు పోయిందని విద్యుత్‌శాఖ మం త్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. బాపట్ల జిల్లా అద్దంకి మండలంలోని వెంపరాలలో మంగళవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్య క్రమంలో మం త్రి రవికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడారు. వైసీపీ ఉనికి కాపాడుకునేందుకు డ్రామాలాడుతుందన్నారు. వైసీపీ నాయకులు కూటమి ప్రభుత్వం పై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. వైసీపీ నాయకులు గ్రామాలలోకి వచ్చినప్పుడు ఐదేళ్లలో ఏమిచేశారో అగడడంతో పాటు కూటమి ప్రభుత్వం ఏడాదిలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమంను వివరిస్తూ వైసీపీ నేతల బురదచల్లే ప్రయత్నాలను ప్రజలు తిప్పి కొట్టాలన్నారు.

వైసీపీ వికృత చర్యలను ప్రజలు ఖండించాలి

మంత్రి గొట్టిపాటి రవికుమార్


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

అద్దంకి,జూలై22(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మంచి చేసిన ప్రభుత్వాన్ని, మంచి చేయని ప్రభుత్వాన్ని ఒకేవిధంగా చూడరాదని, వైసీపీ వికృత చర్యలను అందరూ ఖండించాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని వెంపరాలలో మంగళవారం జరిగిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఎస్సీ కాలనీలో ఇంటింటికి తిరిగి మంత్రి రవికుమార్ కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ కర పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రవి కుమార్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్‌ల ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం సంక్షేమ కార్య క్రమాలను అమలు చేస్తోందన్నారు. ఏడాదికి రూ.33 వేల కోట్ల నిధులను 65 లక్షల మంది లబ్ధిదారులకు పింఛన్‌లుగా అందిస్తోందన్నారు. తల్లికివందనం పథకం ద్వారా ఒక్కరోజే రూ.10 వేల కోట్లను తల్లుల ఖాతాలలో జమచేయ చేస్తున్నట్లు తెలిపారు. ఉచిత గ్యాస్ అందిస్తుందన్నారు. వైసీపీ చర్యలతో రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందులలో ఉన్నా, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తోంన్నారు. పింఛన్ డబ్బులు, గ్యాస్ డబ్బులు అందుతున్నాయా లేదా అని వృద్ధులను, మహిళలను మం త్రి రవికుమార్ అడిగి తెలుసుకున్నారు. ఎన్నో ఏళ్లగా ఎదురు చూస్తున్న తారురోడ్డు పనులు 6 నెలలలో పూర్తవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీచరణ్, ఎంపీడీవో సింగయ్య, ఏపీవో కోటేశ్వరి, డీఈ రమేష్, విద్యుత్ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు, సర్పంచ్ యడ్లపల్లి వెంకాయమ్మ, ఏఎంసీ మాజీ చైర్మన్ నాగినేని రామకృష్ణ, మండలపార్టీ అధ్యక్షుడు కఠారి నాగేశ్వరరావు, క్లస్టర్ ఇన్‌చార్జ్ మానం మురళీమోహన్‌దాస్, పాపసాని నారాయణ, బైరపునేని రామలింగయ్య, మాదాల శ్రీను, సయింపు సురేష్, మాదాల సురేష్, కంచర్ల వెంకటరావు, దివికోలు రాధాకృష్ణ, బైరపునేని సత్యనారాయణ పాల్గొన్నారు.

అద్దంకి,జూలై22(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న 5 సంవత్సరాల కాలంలో రోడ్లకు కనీస మరమ్మతులు కూడా చేపట్టలేదని, కనీసం తట్ట మట్టి కూడా పోసిన పాపాన పోలేదని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. అద్దంకి మండలంలోని శాంతినగర్ నుంచి ఏలేశ్వరవారిపాలెం వరకు రూ.5.10 కోట్ల నాబార్డ్ నిధులతో చేపడుతున్న తారురోడ్డు నిర్మాణం పనులను మంగళవారం వెంపరాల వద్ద మంత్రి రవికుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో అద్దంకి నియోజకవర్గంలో రూ.110 కోట్లతో రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. 20 సంవత్సరాల క్రితం వేసిన తారురోడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరి రాకపోకలకు ఇబ్బందిగా ఉండడంతో నాబార్డ్ నుండి 5.10 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. 6 నెలలో రోడ్డు నిర్మాణం పూర్తవుతుందన్నారు. రోడ్ల వ్యవస్థను వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. వైసీపీ చర్యలతో ప్రస్తుతం రోడ్లు వేయాలన్నా కష్టంగా మారిందన్నారు. కూటమి ప్రభుత్వం గ్రామాలకు, మారుమూల పల్లెలకు సైతం పట్టణాలు, నగరాలలో మౌళిక వసతులు కల్పించి నట్లే అన్ని సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. వెంపరాలలో జలజీవన్ మిషన్ ద్వారా రూ.55 లక్షలతో చేపడుతున్న పనులకు మంత్రి రవికుమార్ శంకుస్థాపన చేశారు.

ఉనికి కోసమే వైసీపీ డ్రామాలు

అద్దంకి : వైసీపీ బ్యాచ్ మొత్తం లిక్కర్‌తో పాటు ఇతర స్కామ్‌లలో చిక్కుకు పోయిందని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. బాపట్ల జిల్లా అద్దంకి మండలంలోని వెంపరాలలో మంగళవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి రవికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకర్లతో మంత్రి రవికుమార్ మాట్లాడుతూ వైసీపీ ఉనికి కాపాడుకునేందుకు డ్రామాలాడు తోందన్నారు. వైసీపీ నాయకులు కూటమి ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తోందన్నారు. వైసీపీ నాయకులు గ్రామాలలోకి వచ్చినప్పుడు ఐదేళ్లలో ఏమి చేశారో అగడడంతో పాటు కూటమి ప్రభుత్వం ఏడాదిలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరిస్తూ వైసీపీ నేతల బురదచల్లే ప్రయత్నాలను ప్రజలు తిప్పి కొట్టాలన్నారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవార్లకు ఆషాడ సారె సమర్పణ


ఊరేగింపుగా ఆషాడ సారె తీసుకొని వెళ్తున్న మహిళలు

చినగంజాం, జూలై 22(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడవకుదురు గ్రామంలో వేంచేసిన పోలేరమ్మ, గంగమ్మ అమ్మవార్లకు మహిళా భక్తులు భక్తిశ్రద్దలతో ఆషాఢ సారె కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని గ్రామంలోని మహిళా భక్తులు తల మీద చీరలు, జాకెట్లు, పసుపు, కుంకుములు, గాజులు, చలిమిడి, పొంగళ్లు, కొబ్బరి కాయులు, అరటి పండ్లు, స్వీట్లును పెట్టుకొని గ్రామంలోని ప్రధాన రహదారుల గుండా మేళతాళాలు, కనకతప్పెట్లతో ఊరేగింపుగా అమ్మవార్ల ఆలయాలకు వెళ్లారు. ఆలయ పూజార్లు బ్రహ్మయ్య, హైమారావులు పోలేరమ్మ, గంగమ్మ అమ్మవార్లను విశేషంగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజలు అనంతరం అమ్మవార్లకు ఆషాఢ సారెను సమర్పించారు. అధిక సంఖ్యలో మహిళా భక్తులు అమ్మవార్లను దర్శించుకొని పూజలు జరిపారు. ముందుగా గ్రామంలోని మహాలక్ష్మి అమ్మవారు, పోతురాజు విగ్రహం వద్ద పూజలు నిర్వహించారు. గాజులు, పసుపు కుంకుములు, చలిమిడి, పండ్లను గ్రామంలోని మహిళలకు పంపిణీ చేశారు. గ్రామంలోని పలు సామాజిక వర్గాల పెద్దలు, మహిళల ఆధ్వర్యంలో అమ్మవార్ల సారె కార్యక్రమాన్ని నిర్వహించారు

మార్టూరులోని ఓ నివాసంలో చోరీ


చోరీకి గురైన ఇళ్లు

మార్టూరు, జూలై22 (ఆంధ్రజ్యోతి): మార్టూరులో కొణిదెనరోడ్డులో అమ్మ ఆశ్రమం సమీపంలోని కొండముది కోటేశ్వరరావుకు చెందిన ఇంటిలో గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం వేకువ జామున దొంగతనానికి పాల్పడ్డారు. గతంలోనే కోటేశ్వరరావు చనిపోగా, ఆయన భార్య కల్యాణి ఇంటిలో నివాసం ఉంటున్నారు. ఆమె పెద్ద కుమారుడు శివ హైదరాబాదులో ఉద్యోగం చేస్తుండగా, చిన్న కుమారుడు గుంటూరులో ఉంటున్నారు. అయితే నాలుగురోజులు క్రితం కల్యాణి తీర్థయాత్రలు నిమిత్తం కాశీ వెళ్లారు. దీంతో ప్రస్తుతం ఇంటిలో ఎవరూ లేకపోవడం గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. ఇంటిలో మొదటి అంతస్తులో నివసిస్తున్న కల్యాణి కుటుంబం వంటగది కిటికీ ఇనుప జల్లెడను తొలగించిన దొంగలు ఇంటిలోకి ప్రవేశించి, బీరువాలోని బట్టలను, వస్తువులను, మాస్టర్ బెడ్‌రూంలో ఉన్న వస్తువులను చెల్లాచెదురుగా చేశారు. అయితే రాత్రి 3 గంటల సమయంలో ఇంటిలో దొంగతనం చేస్తున్న వ్యక్తులలో ఒక వ్యక్తి ఇంటి వరండాలో బయటకురావడం, అతను పైనున్న సీసీ పుటేజీని గమనించి, మరల ఇంటిలోకి వెళ్లిన ఘటన జరిగాయి. ఈ విషయాన్ని హైదరాబాదులో ఉన్న కుమారుడు శివ ఉదయం 6 గంటల సమయంలో సెల్‌ఫోన్‌లో సీసీ పుటేజీలో గుర్తుతెలియని వ్యక్తి కనిపించడంతో, ఈ విషయాన్ని మార్టూరులో బాబాయి రఘుకు ఫోన్‌లో తెలిపారు. దాంతో రఘు దొంగతనం జరిగిన ఇంటిలోకి వెళ్లి, ఇంటిలోపల పరిశీలించి, ఈ విషయాన్ని 100 కు సమాచారం అందించారు. దీంతో స్టేషన్ నుండి పోలీసులు వచ్చి, ఇంటిని పరిశీలించారు. అంతేగాకుండా క్లూస్ టీం బృందాన్ని పిలిపించారు. వారు ఇంటిలో పరిశీలించి,కొన్ని వేలిముద్రలను సేకరించినట్లు తెలిసింది. అయితే ఇంటిలో జరిగిన దొంగతనంలో ఏ వస్తువులు ను దొంగలు తీసుకువెళ్లారో, పోలీసులకు సమాచారం తెలియలేదు. కాశీ నుండి బుధవారం ఉదయానికి కల్యాణి ఇంటికి వస్తుందని, ఆమె వచ్చిన తర్వాత ఇంటిలో ఏ వస్తువులు పోయాయో చూసి, అప్పుడు పోలీసులకు ఫిర్యాదు చేస్తారని రఘు తెలిపారు.

వైభవంగా అమ్మవారి సారె మహోత్సవం

పేరాల(చీరాల), జూలై 22 (ఆంధ్రజ్యోతి) : పేరాలలో వేంచేసియున్న శ్రీభద్రావతి సమేత శ్రీభావనాఋషి దేవస్థానంలో అమ్మవారి సారె మహోత్సవం కమిటి ప్రతినిధులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి మహిళ భక్తులు విశేషంగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే కార్యక్రమంలో పాల్గొన్న మహిళలకు లక్కీడిప్ ద్వారా బహుమతుల అందజేశారు. గుర్రం శ్రీనివాస్, వెంకట సుబ్బారావు, దేవేంద్రం, జివి పున్నారావు పర్యవేక్షించారు.

సెయింట్ ఆన్స్‌లో బెస్ట్ లెక్చరర్ కార్యక్రమం

చీరాల, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : చీరాల సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో ఆర్టిరియల్ స్టిఫ్‌నెస్‌పై బెస్ట్ లెక్చరర్ కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించినట్లు కళాశాల కార్యదర్శిగా వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మెడికల్ ఫిజియాలజీ ఎస్‌కె చాందిని హాజరై అవగాహన కల్పించారు. కార్యక్రమంను ప్రిన్సిపల్ డా.నాగేశ్వరరావు పర్యవేక్షించగా విద్యార్థులు పాల్గొన్నారు.

చీరాల కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయాలి

చీరాల, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : చీరాల కేంద్రంగా జిల్లాను ఏర్పాటు చేసి శ్రీదుగ్గిరాల గోపాలకృష్ణయ్య పేరు పెట్టాలని చీరాల కేంద్ర జిల్లా సాధన సమితి ప్రతినిధులు తాడివలస దేవరాజ్ డిమాండ్ చేశారు. జిల్లా ఏర్పడితే పర్యాటకం, ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ఆయన వివరించారు.

బధిరులకు భోజన వసతి

అద్దంకిటౌన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): పంగులూరు మండలం కశ్యాపురం గ్రామ మాజీ సర్పంచ్ వెలగతోటి రాములు సంవత్సరికం సందర్భంగా మంగళవారం అద్దంకిలోని బధిరుల ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థులకు మధ్యాహ్నం భోజన అందించారు. ముందుగా రాములు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జ్యోతి హనుమంతరావు, ఐ క్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు జ్యోతి రమేష్‌బాబు, రాములు కుటుంబ సభ్యులు చిన్న వెంకటరావు, రాజేష్ ఖన్న, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే పీ-4 లక్ష్యం

● స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లవన్న

పర్చూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : పేదరిక నిర్మూలనే పీ-4 లక్ష్యమని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లవన్న అన్నారు. జీరో పావర్టీ పీ-4 కార్యక్రమంపై పర్చూరు మండలం నూతలపాడు గ్రామం పంచాయితీ కార్యాలయం ప్రాంగణంలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా స్పెషల్ కలెక్టర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర- 2047 దర్శనిక కార్యక్రమం క్రింద ప్రభుత్వం ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. పేదరికం లేని సమాజమే లక్ష్యంగా కార్యక్రమాన్ని తీసుకురావటం జరిగిందన్నారు. దీనిలో విరాళం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్న సంపన్న వ్యక్తులను మార్గదర్శకులు అంటారని, నిరుపేద లబ్ధిదారులను బంగారు కుటుంబంగా గుర్తిస్తారనని తెలిపారు. మార్గదర్శి కుటుంబాలు చూపేబాటలో బంగారు కుటుంబాలు అభివృద్ధి చెందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రద్యూమ్నకుమార్, తహసీల్దార్ పి.బ్రహ్మయ్య, ఈవోఆర్‌డీ కె.సత్యన్నారాయణ, వెలుగు ఏపీఎం రామకృష్ణ, సర్పంచ్ చిన్నా, రెవెన్యూ, సచివాలయ, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ మండల కమిటీ ఎంపిక

చినగంజాం, జూలై 22(ఆంధ్రజ్యోతి) : స్థానిక సోపిరాల రైల్వేగేటు సెంటర్‌లోని బారతీయ జనతా పార్టీ కార్యాలయంలో మంగళవారం మండల పార్టీ అధ్యక్షులు ఉలిచి రాజేష్ అధ్యక్షతన పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన మండల కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏన్నిక ఏకగ్రీవంగా జరిగింది.ఉపాధ్యక్షులుగా అన్నేపోగు అప్పలనాయుడు, కొల్లూరి మరియమ్మ, కందుకూరి పద్మ, వేజండ్ల శ్రీనివాసరావు తదితరులు కమిటీలో ఉన్నారు.

గాడితప్పిన సంక్షేమం

(5వ పేజీ తరువాయి)

వేధించిన ఘటనలున్నాయి.

- నగరంలోని కలెక్టర్ బంగ్లా రోడ్డులోని ఓ కళాశాల హాస్టల్‌లో ఓ విద్యార్థిని గర్భం దాల్చి, బిడ్డకు జన్మనిచ్చినా.. గుర్తించలేని దుస్థితిలో పర్యవేక్షణ ఉంది.

- జూట్ మిల్ సమీపంలోని మరో కళాశాల వసతి గృహంలోని ఒక విద్యార్థినిని వైసీపీ పాలనలో ఓ నాయకుడి అనుచరులు మాయమాటలు చెప్పి కిడ్నాప్ చేశారు. నగరంలోని రాజీవ్ స్వగృహ నివాసాల్లో ఉంచి రెండు రోజులు వేధించారు.

- నగరం నడిబొడ్డున ఒక వసతి గృహంలో వంట సరిగా లేక.. విద్యార్థులు సమీపంలోని అన్న క్యాంటీన్‌కి వెళ్లి భోజనం చేశారు. ఈ విషయం అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ గతం డీడీకి నివేదించినా.. పట్టించుకోలేదు.

- సాంఘిక సంక్షేమ శాఖలో ఔట్ సోర్సింగ్ సిబ్బంది నుంచి కొంతమంది అధికారులు నెలనెలా మామూలు వసూళ్లు చేస్తున్నారని ఫిర్యాదులు ఉన్నాయి. సిబ్బంది పనిచేయకపోయినా.. వారికి జీతాలు ఇస్తూ అందిన కాడికి దండుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి.

- మరోవైపు హెచ్‌డబ్ల్యూఓలు పెట్టే బిల్లుల్లో కూడా కమిషన్లు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి కొంతమంది అధికారులు ప్రొటోకాల్ పేరుతో భారీ మొత్తంలో వసూళ్లు చేసిన ఘటనలు ఉన్నాయి.

- కొంతమంది హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లపై విజిలెన్స్ విచారణ ఉన్న పట్టించుకోవడం లేదని, పూర్తిస్థాయిలో దర్యాప్తు జరపడం లేదని విమర్శలున్నాయి.

- తాజాగా నగరంలోని ఓ కళాశాల హాస్టల్ నుంచి ఓ విద్యార్థిని అదృశ్యమైనట్లు ఫిర్యాదులు ఉన్నాయి. ఈ విషయం గోప్యంగా ఉంచి సదరు అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఇలా సాంఘిక సంక్షేమ శాఖ గత అధికారుల హయాంలో గాడి తప్పింది. నూతనంగా వచ్చిన అధికారి అయిన శాఖను గాడిలో పెడతారా? లేదా అని విద్యార్థులు వారి తల్లిదండ్రులు సిబ్బంది ఎదురుచూస్తున్నారు.

సమ్మె విరమించిన ఇంజనీరింగ్ కార్మికులు


స్వీట్లు పంపిణీ చేస్తున్న కమిషనర్ రవీంద్ర

అద్దంకిటౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారానికి పదవ రోజుకు చేరుకుంది. ఈ క్రమంలో ప్రభుత్వం కార్మిక నాయకులతో చర్చించి కార్మికులకు సంబంధించిన పలు సమస్యలను పరిష్కరించేందుకు హామీ ఇవ్వడంతో సమ్మె విరమించినట్లు సీఐటీయూ మండల నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రవీంద్ర సమ్మెలో ఉన్న కార్మికులతో మాట్లాడి సమ్మెను విరమింపజేశారు. కార్మికులకు కమిషనర్ స్వీట్లు పంపిణి చేశారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు కావూరి రఘుచంద్, ఇంజనీరింగ్ విభాగం వర్కర్స్ యూనియన్ నాయకులు జాన్, సామ్యూల్, వడివేలు, మారుతి, మార్కు తదితరులు ఉన్నారు.

కార్మిక నేత నాగేశ్వరరావు హఠాన్మరణం


నాగేశ్వరరావు (ఫైల్)

చీరాల, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ఏఐటియుసి చీరాల నాయకులు, దేవతోటి నాగేశ్వరరావు(56) మంగళవారం ఉదయం హఠాన్మరణం చెందారు. దాదాపుగా 40 సంవత్సరాల పాటు కార్మికుల కోసం ఆయన అలుపెరుగని పోరాటం చేశారు. నాలుగు నెలల క్రితం ఏఐటీయూసీలో చేరారు. ఈక్రమంలో సిపిఎం పార్టీ రాష్ట్ర నాయకులు శ్రీనివాసరావు, బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య, ప్రకాశం జిల్లా కార్యవర్గ సభ్యులు చీకటి శ్రీను, స్థానిక నాయకులు ఎన్ బాబురావు, కొండయ్య, పలువురు ఉద్యోగులు, కార్మికులు పాల్గొని నివాళులు అర్పించారు. బుధవారం నాగేశ్వరరావు అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

కరకట్టకు.. కోతలు

(5వ పేజీ తరువాయి)


ఓలేరుపల్లెపాలెంవద్ద కుంగిన కరకట్ట

సాగిస్తున్నాయి. దీంతో రాజధాని గ్రామాలైన లింగాయపాలెం, ఉద్దండరాయునిపాలెంలో కరకట్ట పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా మారింది. గత వైసీపీ హయాంలో అప్పటి ఎంపీ నందిగం సురేశ్ నేతృత్వంలో టిప్పర్ల రాకపోకలతో కరకట్ట పూర్తిగా ధ్వంసమైపోయింది. బ్యారేజి దిగువున పిరాట్లంక, చెన్నుపల్లివారిపాలెం, కనగాలవారిపాలెం సమీపంలో పైప్‌లైన్లతో ప్రమాద భరితంగా మారింది. దీంతో మైనేనివారిపాలెం, పిరాట్లంక, చెన్నుపల్లివారిపాలెం, గంగడిపాలెం, లక్ష్మీపురం, అడవిపాలెం గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. కట్టను పటిష్ఠం చేయాలని ఆయా గ్రామాల ప్రజలు అధికారులను, ప్రజాప్రతినిధులను కోరినా ఇప్పటి వరకు దాని గురించి పట్టించుకోలేదంటున్నారు. కరకట్టపై పెట్రోలింగ్ చెయ్యాల్సిన అధికారులు స్థానికంగా ఉండకుండా గుంటూరులో నివాసం ఉంటున్నారు. దీంతో కట్టపై పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. గత ఏడాది వరదల సమయంలో కృష్ణారివర్ ఏఈ ప్రత్యక్షమై హడావుడి చేశారు. ఆ తర్వాత ఈ పదినెలల్లో ఒక్కసారి కూడా కట్టను పరిశీలించిన దాఖలాలు లేవు.

అనుసంధానం మొదలు

(5వ పేజీ తరువాయి)

అందుబాటులోకి రాలేదు.

● మందడం, కృష్ణాయపాలెం వద్ద జాప్యం

మందడం టోల్‌గేట్ నిర్మాణంతో పాటు ఇక్కడే నిర్మిస్తున్న ఫ్లైఓవర్ పనులు ఇంకా కొంతమేర పెండింగులో ఉన్నాయి. దీంతోపాటు కృష్ణయ్యపాలెం, కురగల్లు సమీపంలో ఈ-11 రోడ్డు సమీపంలో కొండవీటివాగు రిజర్వాయర్ వద్ద నిర్మిస్తున్న బ్రిడ్జి పనులు కూడా జాప్యానికి మరో కారణం. ఈ పనులు కూడా ప్రస్తుతం చివరి దశలో ఉన్నాయి. కాగా ఈ-10 రోడ్డు వద్ద అప్రోచ్ రోడ్డు పనులు జరుగుతున్నాయి. దీంతో పాటు గుంటూరు- విజయవాడ రైల్వే లైనుపై మంగళగిరి, చినకాకాని సమీపంలో నిర్మించే ఆర్వోబీ కూడా పూర్తయింది. సేఫ్టీ వాల్ నిర్మాణ పనులు తుది దశకు చేరాయి.

● కాజ జంక్షన్ వద్ద అనుసంధాన పనులు

కాజ- చినకాకాని సరిహద్దుల్లో వెస్ట్ బైపాస్ అనుసంధానించడం కోసం ఎన్‌హెచ్- 16 మీద రాకపోకలను సర్వీసు రోడ్డులోకి మళ్లించారు. కాజ జంక్షన్ వద్ద వెస్ట్ బైపాస్ ఎంట్రన్స్‌లో పెద్ద ఆర్చి నిర్మాణాన్ని ఏర్పాటు చేసి సైన్ బోర్డులను ఏర్పాటు చేస్తున్నారు. చిలకలూరిపేట వద్ద నిర్మించిన బైపాస్‌ను ఎన్‌హెచ్- 16లో అను సంధానించిన విధంగానే కాజ వద్ద కూడా రెండు రోడ్ల అనుసం ధానం ఉంటుందని ఎన్‌హెచ్ఏఐ అధికారులు చెబుతున్నారు. కాగా సెప్టెంబరు చివరి నాటికి వెస్ట్ బైపాస్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుందని వారు స్పష్టం చేశారు.